ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

వార్త

ఆదివారం 21, జనవరి 2024 16 పేజీలు



# ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ విపి గౌతమ్

16వ పేజీలో...



## బీఎస్సీ నర్సింగ్ విద్యార్థుల విన్నపాలు

# వినేదెన్నడో?

రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి గారూ .. మా మొర వినండి

కనికరించని కెఎన్ఆర్ యూనివర్సిటీ

ఐఎన్‌సీ నిబంధనల ప్రకారం ఒకే రకమైన భర్తీ విధానాన్ని వర్తింపజేయండి : ఐఎంఏ తెలంగాణ

2లో..

భద్రాచలం, ప్రభాతవార్త :

ఎన్నిసార్లు మా మొరను విన్నవించినా .. రాష్ట్ర ప్రభుత్వం వినడం లేదని, తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వంలో అయినా మా సమస్యలు తీరుతాయనే ఆతృతతో వేలమంది బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి గారూ మా మొరను వినండి అంటూ వేడుకుంటున్నారు. వివరాలలోకి వెళితే ... ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర శాఖ బీఎస్సీ(నర్సింగ్) కోర్సులో ప్రవేశమునకు ఎంసెట్/నీట్ పరీక్ష రాసిన వారికి అర్హత కల్పిస్తూ కన్వీనర్ కేటగిరి,మేనేజ్‌మెంట్ కేటగిరిలకు ఒకే రకమైన నిబంధనలను



2లో..

# బీజాపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

-ముగ్గురు మావోయిస్టులు మృతి

చర్ల ప్రభాతవార్త:

బీజాపూర్ జిల్లాలో శనివారం జరిగిన ఎదరుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఇందులో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారు. బాసగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో నాడ్రా గ్రామ సమీపంలోని బెలంగుట్ట అటవీ ప్రాంతంలో మావోయిస్టు సీనియర్ కమాండర్లు వినోద్ శర్మ, పూనెంరాజు, విశ్వనాథ్, గడ్డు తెలం ఆధ్వర్యంలో సమావేశం అవుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు సీఆర్‌పీఎఫ్ ఎలైట్ కోబ్రా 210 బీజాపూర్ డిఆర్‌జీ పోలీసులు ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. భద్రతా బాలగాల రాకను గమనించిన మావోయిస్టులు కాల్పులకు దిగారు. ప్రతిగా భద్రతా బలగాలు కాల్పులు జరిపారు. ఇరువురి మధ్య కొద్దిసేపు ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పుల అనంతరం ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టిన పోలీస్ బలగాలకు ముగ్గురు



2లో..

# పూత పూయని మామిడి

తెగుళ్ల బారిన మామిడి తోటలు

దిగాలు చెందుతున్న రైతులు

వాతావరణంలో మార్పుతో పూతకు రాని మామిడి

ఖమ్మం, ప్రభాతవార్త

ఆరుగాలం కష్టించి మామిడి తోటలు సాగు చేసిన రైతులకు ప్రతి సంవత్సరం ఏదో ఒక ప్రతిబంధకం ఏర్పడడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి మామిడి తోటలను సాగు చేయగా వాతావరణ పరిస్థితులు అనుకూలించక దిగుబడి రాక నష్టపోయి అప్పులపాలవుతున్నారు. ఒక దశలో మామిడి తోటల సాగుకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిసారిస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఈ ఏడాది మామిడి



16వ పేజీలో...

# భరోసా కేంద్రానికి కాంట్రాక్టు పద్దతిలో ఉద్యోగాల కోసం దరఖాస్తుల స్వీకరణ

- జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు

# బాలల సంరక్షణతో పాటు ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమాలు

- జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు

8వ పేజీలో...

# పారిశుధ్య కార్యక్రమాలు ప్రతీరోజు జరగాలి

- పాల్వంచలో పర్యటించిన కలెక్టర్ ప్రియాంక ఆల



16వ పేజీలో...

# బీఎస్సీ నర్సింగ్ విద్యార్థుల విన్నపాలు వినేదెన్నడో ..?

**(మొదటి పేజీ తరువాయి..)**

వర్తింపజేయాలని ఆరోగ్యశాఖ మంత్రిని, కాళోజీ నారాయణరావు (కేఎన్ఆర్) యూనివర్సిటీ వారిని నర్సింగ్ విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విధంగా ప్రస్తుతం ఉన్న ఆదేశాలను సడలించాని, 2వేల మంది విద్యార్థులకు న్యాయం చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా.పీ.కాళీ ప్రసాదరావు, కార్యదర్శి డా.కే.విజయరావు, రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరి డా.రాజేంద్రకుమార్‌యాదవ్ ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో 121 నర్సింగ్ కళాశాలలు ఉండగా, వాటిలో 6,500ల బీఎస్సీ నర్సింగ్ సీట్లు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో 4500ల సీట్లు కన్వీనర్ కేటగిరి, మరియు 2 వేల సీట్లు మేనేజ్‌మెంట్ కేటగిరి కింద భర్తీ చేయాల్సి ఉంది. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ బీఎస్సీ నర్సింగ్ ప్రవేశం కొరకు ఎంసెట్/నీట్ పరీక్ష రాసిన వారు కన్వీనర్/ మేనేజ్‌మెంట్ కేటగిరిలకు చెందిన వారికి ఒకే రకమైన నిబంధనలు వర్తింపజేయాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కేఎన్ఆర్ హెల్త్ యూనివర్సిటీ వారు పాటించలేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కన్వీనర్ కేటగిరి ఎంసెట్ ర్యాంకు, మేనేజ్‌మెంట్ కేటగిరి, నీట్ క్వాలిఫికేషన్ ఉండాలనే నిబంధనలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజన, వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు అధికంగా ఉన్నారు. నీట్ పరీక్ష అర్హత పొందిన వారు అతి తక్కువ మంది ఈ ప్రాంతంలో ఉన్నారు. దీని వలన మేనేజ్‌మెంట్ కేటగిరి ద్వారా భర్తీ చేయాల్సిన 2వేల సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల తమిళనాడు, కర్నాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాలలో బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు ఒకే రకమైన నిబంధలను ప్రవేశపెట్టి ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ఆదేశాల ప్రకారం కన్వీనర్, మేనేజ్‌మెంట్ కేటగిరిలలో ప్రవేశాలకు అర్హత కల్పించారు. తెలంగాణ రాష్ట్రంలో గడిచిన 10 సంవత్సరాల నుండి ఇంటర్మీడియట్, బైపీసీ ర్యాంకు ఆధారంగా కన్వీనర్, మేనేజ్‌మెంట్ కేటగిరికి ఒకే రకమైన నిబంధనలు వర్తింపజేశారు.

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ ఎంసెట్/నీట్ పరీక్ష రాసిన వారికి బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి కన్వీనర్/ మేనేజ్‌మెంట్ కేటగిరి ద్వారా వర్తింపజేసి మిగిలిన సీట్లను ఇంటర్మీడియట్ బైపీసీ ర్యాంకు ఆధారంగా భర్తీ చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆదేశాలను సడలించాలని ఆరోగ్యశాఖ మంత్రి, కాళోజి నారాయణరావు యూనివర్సిటీ వారిని విద్యార్థులు కోరుతున్నారు. ఈ చర్య వలన విద్యార్థులకు న్యాయం జరుగుతుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా.పీ.కాశీ ప్రసాదరావు, కార్యదర్శి డా.కే.విజయరావు, రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరి డా.రాజేంద్రకుమార్‌యాదవ్, ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా కో.ఆర్డినేటర్ డా.ఎస్.ఎల్.కాంతారావు,డా.బీ.సుబ్బరాజు, డా.రాజారెడ్డి, డా.జీ.వీ.వీ.సుదర్శన్‌రావు, సూర్యనారాయణ, తదితరులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# పూత పూయని మామిడి

**(మొదటి పేజీ తరువాయి..)**

తోటల రైతులను వెంటాడాయి. పరిస్థితులు అనుకూలించకపోవా అని ధైర్యం చేసి ముందుకు వచ్చిన రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. గత సంవత్సరం ఈదురుగాలులు, అకాల వర్షాలకు నష్టపోయిన మామిడి రైతులు ఈ ఏడాది జనవరి పూర్త కావస్తున్నా మామిడి చెట్లకు పూత రాకపోవడంతో దిగాలు చెందుతున్నారు. పరిస్థితి ఏమిటా అని ఆందోళన చెందుతున్నారు. డిసెంబర్‌లోనే మామిడి చెట్లకు పూత రావాలి. నేటికీ జాడ లేని పూతతో ఆలోచనలో పడ్డారు. ఒక వైపు వర్షాభావ పరిస్థితులు మరో వైపు పొగతో కూడిన మంచు కురవడం కారణంగా పూత పూయడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఉదా ్యనవన శాఖ అధికారులను సంప్రదించగా వాతావరణంలో వచ్చిన మార్పు కారణంగా పూత పూయడం లేదని సమాధానం ఇస్తున్నారే తప్ప సమస్యకు పరిష్కార మార్గం దొరకడం లేదు. ప్రకృతి సిద్దంగా రావాల్సిన పూతకు కూడా ఎవరూ ఏమీ చేయలేని పరస్థితి నెలకొంది. అక్కడక్కడా పూత వచ్చినప్పటికీ పొగ మంచు కారణంగా రాలి కింద పడుతుండడంతో సమస్య మళ్లీ మొదటికి వస్తుంది. ఈ క్రమంలో రైతులు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిసారిస్తున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి మామిడి తొటలను కాంట్రాక్టుకు తీసుకున్న కాంట్రాక్టర్లు తల బాదుకుంటున్నారు. మామిడి దిగుబడి వచ్చినా రాకపోయినా చేసుకున్న ఒప్పందం ప్రకారం పైసలు చెల్లించాల్సిందే. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలించకపోవడంతో చేతులెత్తేసే పరిస్థితి నెలకొంది. ఎకరానికి రూ. 50 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఎన్నో వ్యయప్రయాసలకు లోనై పెట్టుబడి పెట్టగా పూత రాకపోగా తెగుళ్ల సోకడంతో రైతులు మరింత కుంగిపోతున్నారు. అదనంగా పెట్టుబడి పెట్టి తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ తెగుళ్ల అదుపులోకి రాకపోవడంతో అయోమయంలో పడ్డారు. ఆకుమచ్చ పురుగు, పేను బంక, ఆకు నల్లి తెగుళ్ల, మామిడి చెట్లకు సోకినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఉద్యానవన శాఖ అధికారులను, సైంటిస్టులను సంప్రదించి తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ అదుపులోకి రావడం లేదు. ఇదే పరిస్థితి మరో నెల రోజుల పాటు కొనసాగితే మామిడి దిగుబడిపై రతులు ఆశలు వదులుకోవాల్సిందే. ఎకరానికి ఐదు నుండి పది టన్నులు మామిడి దిగుబడి కావాలి. ఇంత వరకు పూత పూయక పోవడం, మామిడి తోటలు తెగుళ్ల బారిన పడడం తదితర పరిస్థితులను గమనిస్తే దిగుబడి మరింత తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో పెట్టిన పెట్టుబడి పూడక అప్పులపాలు కాక తప్పదంటున్నారు. ముందుగా మామిడి చెట్లకు పూత వస్తేనే కాయలు కాసి ఆ తరువాత పండ్లు వచ్చే అవకాశం ఉంటుంది. పూతే పూయకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలి. క్రమక్రమంగా మామిడి తోటల సాగు విస్తీర్ణం తగ్గిపోతుంది. తీవ్ర నష్టాలు వస్తుండడంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నారు. గత సంవత్సరం నష్టపోయిన మామిడి తోటల రైతులు చెట్లను నరికి వంట చెరుకుగా వినియోగించారు. మామిడి తోటల స్థానంలో ప్రత్యామ్నాయంగా వరి తదితర పంటలను సాగు చేశారు. ఈ ఏడాది కూడా పరిస్థితులు అదే విధంగా ఉన్నాయి. ఒకవేళ కష్టించి పండించినప్పటికీ ప్రతి ఏటా మే మాసంలో ఈదురుగాలులు, అకాల వర్షాలు సహజంగా వస్తుంటాయి. ఈ నేపథ్యంలో మామిడి తోటల రైతులు తీవ్రంగా నష్టపోక తప్పదు. ముందస్తుగానే మామిడి తోటల రైతులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఒక్కసారి మామిడి తోటలను కాంట్రాక్టు తీసుకున్న కాంట్రాక్టర్లు రెండవసారి ముందుకు రాని పరిస్థితి. ఇప్పటికే చాలా చోట్ల మామిడి తోటలను నరికి వంట చెరుకుగా వినియోగిస్తూ ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మామిడి దిగుబడి తగ్గి వేసవిలో పచ్చడి మామిడి కాయలకు, పండ్లకు విపరీతంగా డిమాండ్ పెరుగుతుంది. ధర కూడా విపరీతంగా పలుకుతుంది. గత వేసవిలో కిలో మామిడి పండ్లు రూ. 100 వరకు ధర పలికింది. పరిస్థితులు ఇలానే కొనసాగితే ఈ ఏడాది కూడా ధరలు మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. ఏది ఏమైనప్పటికీ మామిడి తోటల సాగు రైతులకు లాభసాటిగా ఉండడం లేదు. ప్రతి ఏటా రైతులు సంక్షోభంలో కూరుకుపోతున్నారు. ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్ర పర్యటన నిర్వహించి తెగుళ్ల నివారణకు సూచనలు ఇవ్వడంతో పాటు మామిడి దిగుబడికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

# రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

*కోదాడ రూరల్, జనవరి 20 ప్రభాతవార్త*

రహదారి భద్రత ప్రతి ఒక్కరి భాద్యత అని హైద్రాబాద్ ఆర్‌టివో రాచకొండ బాబు అన్నారు. వాహనాలను నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను చాలా వరకు నియంత్రించ వచ్చున్నారు. ముందుగా బయలుదేరు క్షేమంగా గమ్యం చేరు అనే నినాదంతో ఈ ఏడాది చేపట్టిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కోదాడ ఆర్‌టివో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, విద్యార్థులు, డ్రవైర్లు, వాహనదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్బంగా ఆర్‌టివో రాచకొండ బాబు మాట్లాడుతూ పరిమితికి మించిన వేగంతో వాహనాలను నడపరాదని సూచించారు. మద్యం తాగి నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఓవర్ టేక్ డ్రైవింగ్, రాష్ డ్రైవింట్ ఉల్లంఘనలతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలస్యంగా బయలుదేరి



వేగంగా బండి నడిపి ప్రమాదాలకు గురి కావడం కంటే ముందుగా బయలుదేరి క్షేమంగా గమ్యానికి చేరుకోవడం ముఖ్యమన్నారు. ఫిబ్రవరి 14 వరకు కొనసాగనున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులు, డ్రైవర్లు, విద్యా సంస్థల ప్రతినిధులు, ఇతర అన్ని వర్గాలకు చెందిన వాహనదారుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందిస్తామన్నారు.

# బీజాపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

**(మొదటి పేజీ తరువాయి..)**

మావోయిస్టు మృతదేహాలు లభ్యమైయ్యాయి. ఘటనా ప్రాంతంలో మావోల కిట్ బ్యాగులు, ఆయుధాలు, మందుగుండు సామాగ్రి లభ్యమైయ్యాయి. మృతి చెందిన మావోయిస్టు మృతదేహాలను స్టేషన్‌కు తరలించారు.

# సింగరేణి డైరెక్టర్ పా గా ఎన్‌వికే శ్రీనివాస్

*కొత్తగూడెం, ప్రభాతవార్త*



సింగరేణి డైరెక్టర్ పాగా డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వికే శ్రీనివాస్‌ను నియమిస్తూ సింగరేణి సీఎండీ బలరాంనాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టర్ పా గా ఉన్న బలరాం నాయక్ ను సింగరేణి సీఎండీగా ప్రభుత్వం నియమించడంతో ఆ పోస్ట్ ఖాళీగా ఉంది. దీంతో ఆయన స్థానంలో డైరెక్టర్ ఆపరేషన్స్‌గా ఉన్న శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

# ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

*కోదాడ రూరల్, జనవరి 20 ప్రభాతవార్త*

పట్టణంలోని సిసి రెడ్డి పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో శనివారం జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా పకడ్బ ందీగా నిర్వహించినట్లు మండల విద్యాధికారి సలీం షరీఫ్ తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశం పొందేందుకు ప్రస్తుత విద్యా సంవత్సరం ఐదవ తరగతిలో ఉండి ధరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉదయం 11 గంటల నుండి మద్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాలలో 201 మంది విద్యార్థులకు గాను 37 మంది గైర్హాజరు కాగా 164 మంది హాజరయ్యారు. అలాగే సెయింట్ జోసెఫ్ సిసి రెడ్డి పాఠశాలలో 216 మంద విద్యార్థులకు గాను 36 మంది హాజరు కాగా 180 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్‌లు పరిశీలించినట్లు తెలిపారు.

# అభివృద్ధి పనుల ప్రణాళికలను అందజేయాలి

*నడిగూడెం, జనవరి 20 ప్రభాతవార్త*

2024-25 సంవత్సరానికి గాను గ్రామపంచాయితీ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ఈ నెల 25లోపు అందజేయాలని మండల ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఏ ఏ పనులు చేపట్టాలో ముందుగానే ప్రణాళికను సిద్దం చేసుకుని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు అందజేయాలన్నారు. ప్రధానంగా ప్రజల అవసరాలకు ఉపయోగపడే, సౌకర్యాలను కల్పించే పనులకు ప్రాధాన్యత ఇవ్వా లన్నారు. పనులు మంజూరు కాగానే కార్యాచరణను ప్రారంభించా లన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హేమామాలిని, ఎంపిడివో సయ్యద్ ఇమామ్, అధికారులు పాల్గొన్నారు.

# పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

*నడిగూడెం, జనవరి 20 ప్రభాతవార్త*

మండలంలోని తెల్లబెల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల-1లో శనివారం పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ప్రధానోపాధ్యాయులు సిహెచ్. భిక్షం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కమిటీ సభ్యులు సహకరించాలన్నారు. విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేటట్లు చూడాలన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు, ఎస్ఎంసి సభ్యులు ముందుకు రావాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగితేనే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి పథంలో కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి నందిగామ రామారావు, ఎస్ఎంసి సభ్యులు నాగరాజు, సైదులు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు చీరలు పంపిణీ



వైరా,జనవరి20,ప్రభాతవార్త: వైరా లయన్స్‌క్లబ్ కార్యక్రమంలో భాగంగా వారి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయాలని ఉద్దేశ్యంతో గుర్రం విశిష్ట గుర్తింపుగా జివిమాల్ వారి ఆధ్వర్యంలో విశిష్ట ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుర్రం సీతాకుమారి గుర్రం సుమతి నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్రరావు అధ్యక్షతన స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు గుర్రం విశిష్ట పుట్టినరోజును పురస్కరించుకొని వైరాలోని నిరుపేద వృద్ధులకు రూ.12500లు విలువ చేసే చీరలు పంపిణీ చేస్తూ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్2 నంబూరు మధు మాట్లాడుతూ విశిష్ట ఫౌండేషన్ స్థాపించిన నాటి నుండి వైరా మండలానికి ఎంతో అనుబంధం స్థాపించిన నాటి నుండి వైరా మండలానికి ఎంతో అనుబంధం ఉందని వారి సహకారంతో వివిధ పాఠశాలలకు వివిధ రకాల సేవా కార్యక్రమాలు మౌళిక వసతులు రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరిగిందని విశిష్ట ఫౌండేషన్ వారిని అభినందించారు. క్లబ్ అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్రరావు మాట్లాడుతూ విశిష్ట ఫౌండేషన్ నిర్వాహకులు ఆర్థికంగా ఎదిగినప్పటికిని మానవత దృక్పధంతో మానవతా విలువలను కాపాడుతూ నిరుపేదల మధ్య విశిష్ట పుట్టినరోజులు చేసుకోవడం సంతోషదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్రరావు, గుర్రం సీతాకుమారి, గుర్రం సుమతి, చింతోజు నాగేశ్వరరావు, కొల్లా రాంబాబు, మరికంటి రాంగోపాల్, రాయపూడి నారాయణ, మచ్చా రామారావు, గద్దె నీరజ, చెరుకూరి శ్రీనివాసరావు, శీలం పిచ్చిరెడినడ, తాటికొండ రాము, వాడపల్లి జ్యోతి, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# వేటగాళ్ల ఉచ్చులో పడి అడవి గేదె మృతి

### ఆరుగురిపై కేసు నమోదు
### అటవీశాఖ అదుపులో నలుగురు వ్యక్తులు
### మరో ఇద్దరు పరార్

సత్తుపల్లి, జనవరి 20,ప్రభాతవార్త: అడవి జంతువుల మాంసానికి అలవాటు పడిన కొందరు జంతువులను చంపడానికి రకరకాల ప్రయత్నాల్లో భాగంగా విద్యుత్ తీగలు అమర్చడంతో ఆ తీగల భారీన పడి అడవి గేదె మృత్యువాతకు గురైంది. సత్తుపల్లి మండలం, రేగళ్లపాడు గ్రామ సమీపంలోని అడవుల్లో గల పోడు భూముల సమీపంలో కొందరు ప్రధాన విద్యుత్ లైన్‌కు తీగలు అమర్చి గత కొంతకాలంగా జంతువులను వేటాడుతున్నట్లు ఆ ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం రాత్రి వేటగాళ్లు ప్రధాన విద్యుత్ లైన్‌పై తీగలు అమర్చడంతో అడవి గేదె వైర్లు తాకడంతో మృత్యువాతకు గురవగా ఇట్టి విషయం అటవీశాఖ అధికారులకు సమాచారం అందడంతో సత్తుపల్లి ఫారెస్టు డివిజన్ అధికారి వి. మంజుల ఆధ్వర్యంలో రేంజర్ స్నేహలత, సిబ్బంది ప్రదేశం వద్దకు మృత్యువాతకు గురైన అడవి గేదెను సత్తుపల్లి పశువుల హాస్పిటల్ వద్దకు తీసుకొచ్చి పోస్టుమార్టం నిర్వహించారు.

**ఆరుగురిపై కేసు నమోదు :**

మండల పరిధిలోని రేగళ్లపాడు గ్రామంలోని గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములలో విద్యుత్ తీగలు అమర్చడంతో అట్టి తీగలకు తగిలి అడవి గేదె మృతి చెందినట్లు సత్తుపల్లి ఫారెస్టు డివిజన్ అధికారిణి వి. మంజుల తెలిపారు. శనివారం రేంజర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆమె మాట్లాడుతూ గిరిజనులు సాగు చేసుకుంటున్నటువంటి భూముల్లో పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలి అడవి గేదె మృత్యువాతకు గురైందని ఆమె అన్నారు. మృతి చెందిన అడవి గేదె ఏడు నెలల సూడిదని విద్యుత్ తీగలు అమర్చినటువంటి ఆరుగురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. వారిలో జువ్వాది శ్రీనివాసరావు, సున్నం అర్జున్, వడ్డంగి వెంకటేశ్వరరావు, వాడె రవిలను అదుపులోకి తీసుకున్నామని వీరిలో కోర్టులో ప్రవేశ పెట్టగా, సత్తుపల్లి సివిల్ జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ విద్యుత్ తీగలు అమర్చినవారిలో మరో ఇద్దరు పరారీలో ఉన్నారని మంజుల తెలిపారు. 2019లో ఇందిర జల ప్రభ ద్వారా ఈ పోడు భూముల్లో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారని, నేడు ఆ విద్యుత్ లైన్ల నుండి కొందరు విద్యుత్‌ను అక్రమంగా సార్యం చేస్తూ వేటగాళ్లు ఉచ్చులు వేస్తున్నారని, తద్వారా అడవి జంతువులు ఈ తీగల భారిన పడి మృత్యువాత పడుతున్నాయని మంజుల అన్నారు. సమావేశంలో సత్తుపల్లి, తల్లాడ రేంజర్లు స్నేహలత, కె. అరవిండ్‌లు ఉన్నారు. మంజుల తెలిపారు.

**విద్యుత్ సార్యం జరుగుతున్న**



**పట్టించుకోని అధికారులు :**

అడవి జంతువుల కోసం వేటగాళ్లు ఇష్టానుసారంగా విద్యుత్‌ను అక్రమంగా వాడుకుంటున్నా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యహరించడంతో అడవి జంతువులు మృత్యువాతకు గురువుతున్నాయని ఆశాఖ తీరుపై పలువురు ఆరోపిస్తున్నారు. అటవీ భూముల్లో పోటు కొట్టుకొని వ్యవసాయం చేసుకుంటున్న పొలాల్లో కొందరు ఆ ప్రదేశం గుండా వేసిన మెయిన్ లైన్ మీదుగా విద్యుత్ వైర్లు అమర్చి అడవి జంతవులను అతి దారుణంగా వేటాడుతున్నా వేటగాళ్లను అరికట్టడంలో విద్యుత్ శాఖ అధికారులు, అటవీ అధికారులు విఫలమయ్యారని ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. పంటల రక్షణకు మంచెలు వేసుకొని వణ్య ప్రాణుల రక్షణకు కాపలా కాయాలే తప్ప హైపవర్ ఉన్నటువంటి విద్యుత్ లైన్‌ల మీద ఇలాంటి వైర్లు అమర్చడం వల్ల అడవి జంతువులకే కాకుండా అటుగా వెళ్లే మనుషులకు కూడా ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఐటిడిఏ పీవోను కలిసిన డా. ఎమ్మెల్యే రాఘమయి

### గ్రామాల అభివృద్ధికి రూ. 60 కోట్లు విడుదల చేయండి

సత్తుపల్లి, జనవరి 20,ప్రభాతవార్త: సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు గిరిజన గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు గాను రూ. 60 కోట్లు నిధులు మంజూరు చేయాలని భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ (ఐఏఎస్)కు సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాఘమయి దయానంద్ వినతిపత్రం అందజేశారు.



శనివారం భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారిని కార్యాలయంలో కలిసి గిరిజన గ్రామాలకు కావకాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎమ్మెల్యే డా. రాఘమయి దయానంద్ చర్చించి రూ. 60 కోట్లు విడుదల చేయాల్సిందిగా పీవోను కోరుతూ వినతిపత్రం అందజేశారు.

## నేరాలు-దారుణాలు

### రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



బోనకల్, జనవరి 20, ప్రభాతవార్త: బోనకల్ రైల్వేస్టేషన్ ఎదురుగా రైల్వే లైన్ వద్ద ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఖమ్మం రైల్వే ఎస్ఐ పారుపల్లి భాస్కర్‌రావు ఇచ్చిన సమాచారం మేరకు ఖమ్మం నగరానికి చెందిన అన్నం



సేవా ఫౌండేషన్ వారు సంఘటనా స్థలానికి చేరుకుని రైల్వే పోలీసుల సమక్షంలో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురికి తరలించారు. అలాగే మరొక ఘటనలో ఖమ్మం దానవాయిగూడెం డంపింగ్ యార్డు వద్ద ఉనన ఎస్ఎస్‌పి కెనాల్ కాలువ బ్రిడ్జి కింద రైలు పట్టాలపై గుర్తు తెలియని 60 ఏండ్ల పురుషుడు మృతి చెంది ఉన్నాడు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు అన్నం సేవా ఫౌండేషన్ వారు అక్కడికి చేరుకుని ఆ మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురికి తరలించారు. ఈ రెండు మృతదేహాల వద్ద ఎలాంటి ఆధారాలు లభించ లేదు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది, పుచ్చకాయల దేవేందర్ పాల్గొన్నారు.

### ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించిన ఏఐటియుసి నేతలు



సత్తుపల్లి, జనవరి 20,ప్రభాతవార్త: సత్తుపల్లి జేవీఆర్ ఓపెన్ కాస్టు, కిస్టారం ఓపెన్ కాస్టు గనులలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు నివాసం ఉంటున్న పివి. నర్సింహారావు కాలనీలో ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్‌ను సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు శనివారం సందర్శించారు. జేవీఆర్ ఓసి ఫిట్ కార్యదర్శి జి. నర్సింహారావు, బ్రాంచ్‌కార్యదర్శి సముద్రాల సుధాకర్ బృంధం ఈ ఫిల్టర్ బెడ్‌ను సందర్శించి ఇక్కడ నివశిస్తున్నటువంటి కుటుంబాల వారికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని సంబంధిత సివిల్ ఇంజనీర్ మధీనా పాషాను కోరారు. ఫిల్డర్‌బెడ్ నందు గోదవరి ఇసుకను వాడాలని వారు సివిల్ అధికారికి సూచించారు. కార్మికుల కుటుంబాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన దీనిపై ఉన్నత అధికారులతో మాట్లాడి త్వరితగతిన సమస్య పరిష్కారిస్తాని సివిల్ ఇంజనీర్ మధీనా పాషా ఏఐటియుసి నాయకులకు హామీ ఇచ్చారు. ఫిల్టర్ బెడ్ పరిశీలించిన వారిలో సత్తుపల్లి బ్రాంచ్ అసిస్టెంట్ కార్యదర్శి సూర్యప్రకాష్, జాయింట్ కార్యదర్శి భరణి, కోశాధికారి దమ్మపాటి వెంకటేశ్వరరావు, ఏఐటియుసి నాయకులు కాయితం వెంకటేశ్వర్లు, కంచె శ్రీనివాస్, జారె రవి, గంగాధరణి నాగేశ్వరారవు, మురళీ, శ్రావణ్ కుమార్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా నర్సాపురం పాఠశాల వార్షికోత్సవ సంబురాలు

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :

దుమ్ముగూడెం మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో ఉన్న సూదిరెడ్డి నాగిరెడ్డి, ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు బోళ్ళ వెంకటేశ్వర్లు అధ్యక్షతన వార్షికోత్సవ సభ జరిగింది. ఈ సభకు ఎంఈవో సున్నం సమ్మయ్య, ఎంపీపీ రేసులక్ష్మి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, స్థానిక సర్పంచ్ శివరామకృష్ణ, ఉపసర్పంచ్ రావులపల్లి రవికుమార్, పాఠశాల మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి సూదిరెడ్డి వెంకట రమణారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కే.వీ.కాంతారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ .. సూదిరెడ్డి, నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ పాఠశాలలో సూదిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందిస్తున్న సేవలు మరువలేనివని అన్నారు. సూదిరెడ్డి సోదరుల్లో ఒకరైన వెంకటరమణారెడ్డిని




సన్మానపత్రంతో సత్కరించారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, తదితర పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ రావులపల్లి రవికుమార్ మాట్లాడుతూ .. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఎస్ఎస్‌సీ పరీక్షల్లో పాఠశాలలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతిని అందిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. విద్యార్థిని, విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల లైఫ్ సర్టిఫికేట్ విడుదల చేసే క్యాంపు ప్రారంభం

భద్రాచలం అర్బన్, ప్రభాతవార్త :



భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులో గల ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం భవనం నందు లైఫ్ సర్టిఫికేట్ విడుదల చేయు క్యాంపును ప్రారంభించారు. ఈ రోజు నుండి మార్చి నెలాఖరు వరకు క్యాంపు నిర్వహించబడునని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భద్రాచలం అధ్యక్షుడు జీ.భూషణరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. విశ్రాంత ఉద్యోగులు మీ పీపీవో నెంబర్, బ్యాంకు అకౌంట్ నెంబర్, ఆధార్‌కార్డుతో వచ్చి లైఫ్ సర్టిఫికేట్ తీసుకోవాలని, మిగతా సభ్యులు కూడా ఈ అవకాశంను సద్వినియోగం చేసుకునే దిశగా కోరారు. ఈ కార్యక్రమంలో జీ.భూపతిరావు, వెంకన్న, ఖాదర్, హనుమంతరావు, తులసీదాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం

### -గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

భద్రాచలం క్రైం, ప్రభాతవార్త :



భద్రాచలం పట్టణంలోని శిల్పినగర్‌కు చెందిన 30 సంవత్సరాల వయస్సు ఉన్న రాసాల శ్రీనివాస్ గత నెల 27వ తేదీ నుండి ఇంట్లో నుండి బయటకు వెళ్ళి తిరిగి ఇంటికి రాలేదని శ్రీనివాస్ తల్లి రాసాల పద్మ శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంకటేశ్వర్లు యాదవ కులంకు చెందిన వ్యక్తి అని, చామన ఛాయ రంగు కలిగి ఐదున్నర అడుగుల ఎత్తు ఉంటారని వివరించగా పట్టణ ఎస్సై మధుప్రసాద్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. అదృశ్యమైన వ్యక్తి వివరాలు తెలిసిన వారు పట్టణ సీఐ 8712682105,ఎస్సై 8712682107 నెంబర్‌లకు సమాచారం ఇవ్వాల్సిందిగా ఎస్సై మధుప్రసాద్ పేర్కొన్నారు.

## టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్, స్టిక్కర్ ఆవిష్కరణ

భద్రాచలం అర్బన్, ప్రభాతవార్త ::

భద్రాచలం పట్టణంలోని ఎంపీ యూపీఎస్ జగదీష్ కాలనీలో గల పాఠశాలలో యూటీఎఫ్ క్యాలెండర్, స్టిక్కర్‌లను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సీనియర్ ఉపాధ్యాయులు అయిన రాజా శ్రీనివాస్ చేతులమీదుగా శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, భద్రాచలం మండల అధ్యక్షుడు జే.శ్రీను, అజ్మీర రమేష్, ఆశలత, అనురాధ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



## దుమ్ముగూడెంలో పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశం

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :



దుమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశం హెచ్.ఎం ఏ.వీ.రామారావు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు ప్రతి నెల 3వ శనివారం ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరు అయ్యేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని ఆయన విద్యార్థి తల్లిదండ్రులకు తెలిపారు. ఇంటి దగ్గర చేయాల్సిన హోం వర్క్ గురించి చర్చించి విద్యార్థులు, తల్లిదండ్రులతో ముఖాముఖిగా



మాట్లాడారు. గత రెండు సంవత్సరాలుగా ఉన్న స్కూల్ యాజమాన్య కమిటీ రద్దు చేయబడిందని, కొత్త కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, అట్టి ఎన్నిక నోటిఫికేషన్‌ను హెచ్ఎం విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో 6,7,8 తరగతుల్లో చదువుతున్న తల్లిదండ్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికైన సభ్యులు ఛైర్మన్, వైస్ చైర్మన్, ఎక్స్ ఆఫీషియో, కో.ఆప్షన్ మెంబర్స్‌ను ఎన్నుకుంటారని ఆయన తల్లిదండ్రులకు తెలిపారు. ఈ ఎన్నిక ఈ నెల 28వ తేదీన ఉదయం 7 నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఎస్ఎంసీ సభ్యులు షేక్ హుస్సేన్అహ్మద్, శ్రీవిద్య, సరిత, ఉపాధ్యాయులు లక్ష్మణ్, సత్యనారాయణ, రామకృష్ణ, కోటేశ్వరి, రజిని, తదితరులు పాల్గొన్నారు.

## చర్ల ప్రభుత్వ వైద్యశాలలో వైద్యాధికారి నియామకం

చర్ల ప్రభాతవార్త:



చర్లలోని ప్రభుత్వ వైద్యశాలలో ఎట్టకేలకు వైద్యాధికారిని ప్రభుత్వం నియమించింది. చర్ల గ్రామానికి చెందిన డాక్టర్ బూరుగడ్డ సాయివర్ధన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు.

## వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సహాయం

సారపాక ప్రభాతవార్త:



ఐటీసీ పేపర్ మిల్ ఎస్ఎస్ఎఫ్‌టీ డిపార్ట్మెంట్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న కోటమర్తి శ్రీను ఆరోగ్య పరిస్థితి బాగాలేక విధులకు హాజరు కాకపోవడంతో వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఎస్ఎస్ఎఫ్‌టి డిపార్ట్మెంట్ ఎంప్లాయిస్ మేనేజర్స్, కాంట్రాక్ట్ కార్మికులు, ఇతర దాతల సహకారంతో సేకరించిన విరాళాలు రూ.35,100 శనివారం వారి స్వగృహం గాంధీనగర్ సారపాక వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో శేషగిరిరావు, ఉమా, లెనిన్, సాంబ రెడ్డి, నగేష్ కుమార్, రాజశేఖర్ రెడ్డి, శంకరయ్య, నరేష్, వేణు, రమణ, శ్రీనివాస్, రవి, శ్రీను, రామకృష్ణ, పలువురు తోటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి రక్తదానం

బూర్గంపహాడ్, ప్రభాతవార్త :




ఒడిస్సా రాష్ట్రం మద్దుకూరుకు చెందిన పాండు రామయ్య అనారోగ్యానికి గురి కావడంతో అక్కడ స్థానికంగా వైద్యం చేయించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో రోగి బంధువులు పొంగి జోసఫ్ భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చేరించారు. అక్కడకు చేరుకున్న వైద్యులు పరీక్షించి అత్యవసరంగా ఏ పాజిటివ్ బ్లడ్ ఎక్కించాలని చెప్పడంతో జోసఫ్ ఈ ప్రాంతంలో ఎవరూ తెలియకపోవడంతో తనకు తెలిసిన వారి ద్వారా పండుగ రాములును సంప్రదించి విషయం తెలిపారు. ఆయన సహకారంతో మండల పరిధిలోని నాగినేనిప్రోలు, రెడ్డిపాలెం గ్రామానికి చెందిన భగత్‌సింగ్ బ్లడ్ డొనేషన్ ఆర్గనైజింగ్ గ్రూప్ నిర్వాహకులు పాల సంతోష్‌రెడ్డికి పండుగ రాములు ఫోన్ చేసి ఏ పాజిటివ్ గ్రూప్ రక్తం కావాలని అడగడంతో వెంటనే స్పందించిన శేఖర్ రోగి వద్దకు వెళ్ళి రక్తదానం చేశారు. దీంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగిని కాపాడినట్లయిందని బాధితుని బంధువు జోసఫ్ రక్తదానం చేసిన శేఖర్‌కు రుణపడి ఉంటామని అన్నారు.

# అనగానంద స్వామికి అయోధ్యకు ఆహ్వానం

సత్తుపల్లి, జనవరి 20,(ప్రభాతవార్త): భారతదేశ ప్రజలు ఎప్పుడా ఎప్పుడా అని ఎదురు చూస్తున్న అయోధ్యలో శ్రీ బాలరామ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఈనెల 22వ తేదీన అంగరంగ వైభవంగా కనులు మిరిమిట్లుగొలిపే విధంగా పెద్ద ఎత్తున ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం మరియు శ్రీరామ మందిరం ఆలయ ట్రస్టు ప్రత్యేక ఏర్పాట్లును సిద్ధం చేసింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం జీలుగుమిల్లి మండలం, కామయ్యపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ దత్త సాయి మందిర వ్యవస్థాపకులు శ్రీ అనఘానంద భారతి స్వామీజీ (ధనుంజయ్)కి శ్రీరామ మందిరం ట్రస్టు కమిటీ ఆధ్వర్యంలో స్వామిజీకి అయోధ్య నుండి ఆహ్వానం అందింది. అయోధ్యలో శ్రీరామ చంద్రుని మందిర నిర్మాణంతో పాటు బాలరామున్ని ప్రాణ ప్రతిష్ఠ కార్యమానికి దేశ వ్యాప్తంగా 4 వేల మందికి స్వామీజీలకు శ్రీరామ మందిర ట్రస్టు వారు ఆహ్వానాలు పంపగా ఆందులో శ్రీ అనఘానంద స్వామీజీకి కూడా ఆయోధ్యకు రావాల్సిందిగా ఆహ్వానం పంప దంతో స్వామీజీ శనివారం అయో ధ్య కు చేరుకున్నారు. అయోధ్య నుండి స్వామీజీకి ప్రత్యేకంగా ఆహ్వానం పట్ల కామేయ్యపాలెం గ్రామానికి చెందిన ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా ఈనెల 26,27 మరియు 28వ తేదీలలో షిర్డీలో మొట్టమొదటి సారిగా జరుగుతున్న అంతర్జాతీయ తెలుగు సాయి భక్త సమ్మేళనంలో ఒక్క రోజు కార్యమానికి న్యాయ నిర్ణేతగా మరియు ఒక రోజు వక్తగాను ఆహ్వానం అందినందున అయోధ్య నుండి షిర్డీ కూడా వెళ్తున్నట్లు అనఘానంద స్వామీ ప్రభాతవార్తకు తెలిపారు.








## ఓటరు నమోదు కార్యక్రమం పరిశీలన



బోనకల్, జనవరి 20, (ప్రభాతవార్త): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటర్ల సవరణ 2014 షెడ్యూల్ పురస్కరించుకుని 20,21 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ జి.గణేష్, రెవెన్యూ ఖమ్మం డివిజన్ అధికారి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. బోనకల్ మండలంలోని ముష్టికుంట్ల, బోనకల్, రావినూతల, కలకోట గ్రామాల్లో స్కూల్స్‌లో గల పోలింగ్ కేంద్రాల్లో గల బూత్ లెవల్ అధికారులు వారు క్లైములు స్వీకరించినవి, విచారణ క్రమం విధానంను, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు క్లైములు వచ్చినవి, వాటి విచారణ విధానం పరిశీలించారు. ఆర్‌డిఓ వెంట తహసీల్దార్ పున్నం చందర్, ఆర్ఐ లక్ష్మణ్ నాయక్, గ్రామ బూత్ లెవల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు హాజరయ్యారు.

## చోరీలు చేస్తున్న ఐదుగురు వ్యక్తులు అరెస్టు

దుమ్ముగూడెం (ప్రభాతఎర్త): దుమ్ముగూడెం మండలంలోని మంగువాయి బాడువ గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు వివిధ దొంగతనలు పాల్పడిన సంఘటనలో ఐదుగురు వ్యక్తులను దుమ్ముగూడెం పోలీసులు అదుపులోకి తీసుకుని, అరెస్ట్ చేసి, శనివారం రిమాండ్‌కి పంపించారు. దుమ్ముగూడెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి ... దుమ్ముగూడెం ఎస్ఐ కేశవ రావు తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి మోటార్ సైకిల్‌పై ఒడ్ల బస్తాతో వస్తూ పోలీసులను చూసి పారిపోతుండగా అట్టి వ్యక్తి పోలీసులు పట్టుకుని విచారించగా అతడు మంగువాయి బాడువ గ్రామానికి చెందిన బొర్ర కార్తీక్‌గా తెలిపాడు. ఈనెల 15వ తేదీన వర్క్ షాప్ గ్రామానికి తాటిపూడి రమేష్ అనే రైతుకు చెందిన వడ్లను దొంగతనం చేసింది తనే ఒప్పుకున్నాడని, తనతో పాటు అదే గ్రామానికి చెందిన కల్లూరి జంపన్న, తొర్రం రమేష్, కల్లూరు సమ్మయ్య, సాయికృష్ణ అనే మరో నాలుగురితో కలిసి దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరం, కేశవపట్నం గ్రామాలలో ట్రాక్టర్, వరికోత మిషన్ల బ్యాటరీలను దొంగతనం చేసామని ఒప్పుకున్నాడు. దీంతో దుమ్ముగూడెం పోలీసులు మంగువాయి బాడవ గ్రామానికి చెందిన మరో నలుగురు నిందితులను పట్టుకుని వారి వద్ద నుండి మోటార్ సైకిల్, మూడు బస్తాల వరి ధాన్యం, ఐదు బ్యాటరీలను స్వాధీనం పరుచుకున్నారు. దొంగతనలకు పాలుపడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు దుమ్ముగూడెం పోలీసులు తెలిపారు.

## బిఆర్ఎస్, బిజెపి అసత్య ప్రచారాలు మానుకోవాలి



మహబూబాబాద్,జనవరి20,(ప్రభాతవార్త): గత మూడు రోజుల నుండి సోషల్ మీడియా ద్వారా, చిన్న పత్రికల ద్వారా బిఆర్ఎస్, బిజెపి పార్టీలు చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకోవాలని మల్యాల మాజీ సర్పంచ్ రమేష్, మాజీ ఎంపిటిసి చిమ్నానాయక్‌లు అన్నారు. శనివారం వారు జిల్లాపార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీలో ఎటువంటి వర్గ విభేదాలు లేవన్నారు. ప్రతిపక్ష నాయకులు మానుకోట ఎమ్మెల్యేపై భరత్‌చందర్‌రెడ్డి కన్నెర్ర అని, గడికి తాళం వేసిన కాంగ్రెస్ కార్యకర్తలు అని దృష్ప్రచారాలు చేస్తున్నారని దీన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బిజెపి నాయకులు హుస్సేన్‌నాయక్‌కు ఎమ్మెల్యే మురళినాయక్‌ను విమర్శించే స్థాయి లేదని ఇప్పటికైనా ప్రవర్తన మార్చుకోవాలని లేనియెడల తగిన బుద్ది చెబుతామని హెచ్చరించారు. అదేవిధంగా భరత్‌చందర్‌రెడ్డి గడి అంటున్నారని అది గడి కాదని జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యాలయం అని గత 50సంవత్సరాల నుండి పార్టీ కార్యకలాపాలు ఇక్కడి నుండే నిర్వహిస్తున్నామన్నారు. బిజెపి, బిఆర్ఎస్ నాయకులు వైఖరి మార్చుకోవాలని లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కొవల్సి వస్తుందని హెచ్చరించారు. మల్యాల కాంగ్రెస్ కార్యకర్తలందరం సమన్వయంతో ఉండి గ్రామ అభివృద్ధికి పాటుపడుతుంటే చూసి ఓర్వలేక ఇలాంటి దృష్ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహించారు.

## జోగ్గూడెంలో అయోధ్య శ్రీరాముని అక్షింతలు పంపిణీ



కామేపల్లి, జనవరి 20 (ప్రభాతవార్త): కామేపల్లి మండలం జోగ్గూడెంలో అయోధ్య శ్రీరాముల వారి అక్షింతలను శనివారం ఇంటింటా పంపిణీ చేశారు. గ్రామస్తులు పూజలు నిర్వహించి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జర్పల చంద్రునాయక్, హరిదాస్‌నాయక్, లక్ష్మణ్ నాయక్, రామోజీ నాయక్, బట్టు శంకర్ నాయక్, జర్పల రాములు, భూక్యా లక్ష్మణ్ నాయక్, శంకర్‌నాయక్, హాట్ శంకర్ నాయక్, రాజేష్, రమేష్, బాలకృష్ణ, రాజు, జర్పల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## 22ను సెలవు దినంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలి...



కామేపల్లి, జనవరి 20 (ప్రభాతవార్త): హిందువుల ఆరాధ్యదైవం అయోధ్యలో రామ్‌లాలా ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభోగంగా జరగనున్న నేపథ్యంలో ఈ నెల 22న ప్రతి ఒక్కరు తిలకించేలా కేంద్ర ప్రభుత్వం ఉద్యోగస్తులకు సెలవు ప్రకటించిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించాలని హిందూ సంఘాలు విశ్వహిందు పరిషత్, భజరంగ్ దళ్, రాష్ట్రీయ స్వయం సేవక్, బీజేపీ సామాజిక సమరసత తదితర శాఖలు రాష్ట్ర ప్రభుత్వాన్ని శనివారం డిమాండ్ చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షులు జర్పల రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూక్యా శ్రీను నాయక్, భాస్కర్ నాయక్, జర్పల కృష్ణ నాయక్, పోలూరి రామచంద్రయ్య, కొమ్మినేని భద్రయ్య, భాగం రంగారావు, కొంగర రంగారావు, అమిరినేని దయానంద్, నాగబండి హన్మంతరావు, కర్లపాటి రాజు, జాలే శ్రీనుయాదవ్, వేముల వెంకట్, రాయల రమణయ్య, గుగులోత్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ వ్యాధి బాధితురాలుకు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి రూ.2.50లక్షలు



కామేపల్లి, జనవరి 20 (ప్రభాతవార్త): కామేపల్లి మండలం జాస్తిపల్లి గ్రామానికి చెందిన చల్ల వర్ధిని కిడ్నీ వ్యాధికి గురికావడంతో హైదరాబాదు నిమ్స్ హాస్పటల్‌లో చికిత్స పొం దటానికి రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పగా పేద కుటుంబానికి చెందిన వారు మండల కాంగ్రెస్ కమిటీకి విషయం తెలియజేయడంతో వెంటనే ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్యకి తెలియపరచగా వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ద్వారా రూ.2లక్షల 50వేలు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరు చేశారు. అందుకు సంబంధించిన ఎల్‌వోసీ మంజూరు పత్రాన్ని మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గింజల నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు దేవుళ్ళ రామకృష్ణలు శనివారం అందజేశారు. దీంతో ఆ కుటుంబీకులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, శాసనసభ్యులు కోరం కనకయ్యకు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డికి, పీప రాజేష్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

## వేసవిలో ప్రతి ఇంటికి మంచినీరు అందించాలి

మహబూబాబాద్,జనవరి20,(ప్రభాతవార్త): రానున్న వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి లేకుండా ప్రతి ఇంటికి త్రాగునీరు అందించాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. నీటి సమస్యపై లేవనెత్తిన సమస్యకు మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి వివరిస్తూ మున్సిపాలిటీలో 19వేల గృహ సముదాయాలు ఉన్నాయని వీటన్నింటికి త్రాగునీరు అందించేందుకు 4వేల పాత కనెక్షన్‌లతో పాటుగా 14వేల కొత్త కనెక్షన్‌లు ఇవ్వడం జరిగిందని వివరించారు.




# డైరెక్టర్ త్రివిక్రమ్‌పై క్రిమినల్‌కేసు నమోదు చేయాలి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 20 - (ప్రభాతవార్త): ప్రజా జీవితంలో నిజమైన హీరోలను విలన్లు చేయడానికి త్రివిక్రమ్‌కు సిగ్గుండాలని, గుంటూరుకారం సినిమాలో విలన్లకు పెట్టిన మహనీయులు మార్క్స్, లెనిన్‌ల పేర్లను తొలగించాలని, డైరెక్టర్ త్రివిక్రమ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల జిల్లా కార్యాలయం ఎదుట గుంటూరుకారం సినిమాలో విలన్‌లకు మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడాన్ని నిరసిస్తూ ప్ల కార్డులతో పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లిక్కి బాలరాజు, కాళంగి హరికృష్ణ, బుర్ర వీరభద్రం మాట్లాడుతూ... సినిమా కలెక్షన్ల కోసం మహనీయుల పేర్లను వాడుకోవడం బుద్ధిమాలిన చర్య అన్నారు. దోపిడీ పీడన, అణచివేత,



అసమానతలు లేని సోషలిస్టు సమాజం కోసం అత్యున్నత వర్గ సిద్ధాంతాన్ని మార్క్స్ రచించారని, దానిని లెనిన్ మరింత పరిపుష్టం చేశారన్నారు. ప్రపంచంలో అనేక దేశాల్లో వారు రచించిన సిద్ధాంతాన్ని ఆచరిస్తూ సమసమాజ స్థాపన దిశగా ఆయా దేశాలు పనిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదో అలజడి సృష్టించే అంశాలు సినిమాల్లో పెట్టి కలెక్షన్స్ రాబట్టే పని సినిమా డైరెక్టర్లు చేస్తున్నారని, ఈ క్రమంలోనే మార్క్స్, లెనిన్ పేర్లు గుంటూరు కారం సినిమాలో పెట్టి లబ్దిపొందాలని చూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సందీప్, మందా నాగకృష్ణ, రాంచరణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకులు కల్లుతాగిన కోతుల్లా మాట్లాడుతున్నారు

**- కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న**

కొత్తగూడెం, జనవరి 20 - (ప్రభాతవార్త):



బీఆర్ఎస్ నాయకులు కల్లుతాగి కోతుల్లాగా వింతగా ప్రవర్తించి మాట్లాడుతున్నారని జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న ఆరోపించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 2014లో మిగులు బడ్జెట్ రూ.17 వేల కోట్లలో అమృత కలశాల ఇస్తే 10 సంవత్సరాలలో 7/12 లక్షల కోట్ల అవినీతి అప్పులతోనే ప్రజలపై పెను ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడంలో ముందున్నటువంటి బీఆర్ఎస్ గతంలో అధికారంలో ఉన్నప్పుడు చేసిన అవినీతి, అక్రమాలను ఎండగట్టారు. రైతుబంధు పైసలను భారత్‌జోడో యాత్రకు తరలిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని, ఇలాంటివి మాట్లాడితే మూతులమీద వాతలు పెట్టడం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో పగడాల మంజుల, బోడ దివ్య, పందాల సరిత, భాగ్య, సావిత్రి, సుశీల, రాజేశ్వరి, కల్పన, రాములమ్మ, మల్లమ్మ, జములమ్మ, యాదమ్మ, సుగుణ, వినోద పాల్గొన్నారు.

## కిన్నెరసాని కాలువలో ఈతకు వెళ్లి యువకుడు మృతి

పాల్వంచ క్రైం, జనవరి 20 - (ప్రభాతవార్త): సరదాగా స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు వెళ్లిన యువకుడు నీటిలో మునిగిన మృత్యువాత పడిన సంఘటన శనివారం కరకవాగు గ్రామంలోని కేటీపీఎస్‌కు వెళ్లే కిన్నెరసాని కాలువ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన మృతుడు బోడా అజయ్ (17), అజ్మీరా గురునాథ్, బానోత్ విష్ణు, భూక్యా ప్రశాంత్‌లు కలిసి కరకవాగు వద్ద ఉన్న కిన్నెరసాని కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లారు. అందరూ ఈత కొడుతుండగా బోడా అజయ్ బాగా లోతుగా ఉన్న ప్రాంతానికి వెళ్లి ఈత కొట్టేందుకు వెళ్లాడు. అందరూ చెప్తున్నా వినకుండా వెళ్లడంతో లోతుగా ఉన్న ప్రదేశంలో మునిగిపోయాడు. ఎంత సేపటికైనా బయటికి రాకపోవడంతో అందరూ కేకలు వేస్తూ స్థానికులకు చెప్పారు. వారు వచ్చి బయటికి తీయగా అప్పటికే అజయ్ మృతి చెందాడు., పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## ఓటరు నమోదుపై ప్రత్యేక శిబిరాలు

పినపాక, జనవరి 20, (ప్రభాతవార్త): మండల పరిధిలోని ఓటుహక్కు అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ నూతన ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని, అదేవిధంగా ఇప్పటికే ఓటుహక్కు కలిగిన వారు తమ ఓటరు కార్డులో మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుగూ శనివారం, ఆదివారం మండల పరిధిలోని బిఎల్ఓ కేంద్రాల్లో అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఫామ్ నెంబర్ 6, నూతన ఓటుకు దరఖాస్తులు, ఫామ్ నెంబర్ 7లో చనిపోయిన, ఊరు విడిచి వెళ్లిన వారి ఓటు తొలగింపు, ఫామ్‌నెంబర్ 8 చిరునామాల్లో మార్పులు, తప్పుల సవరణ చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయని, తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అసాంఘీక శక్తులు సంచారంపై సమాచారం ఇవ్వండి

**సిఐ శివప్రసాద్**

పినపాక, జనవరి 20, (ప్రభాతవార్త



ఆదివాసీలు మెరుగైన జీవన శైలి కోసం ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఏడూళ్ల బయ్యారం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శివ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని ఉమేష్ చంద్ర నగర్ ఆదివాసీ గ్రామంలో శనివారం పర్యటించి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో సమాజహిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఆదివాసీలు సమాజం ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ఆదివాసీ గ్రామాల్లో మిరప కోతలు జరుగుతున్న నేపథ్యంలో ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానిత వ్యక్తుల సంచారంపై స్థానిక పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. జీవితాలు నాశనం చేసే చెడు వ్యసనాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఏ ఒక్కరూ పాల్పడ వద్దని అవగాహన కల్పించారు. తమ ఆవాస ప్రాంతాల్లో కొత్త వ్యక్తుల కదలికలు గుర్తించినట్లయితే వెంటనే 100 ఫోను చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది, సిఆర్‌పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వివాంట సీడ్స్, జెస్సీ మిరప రకాలపై రైతులకు క్షేత్ర ప్రదర్శన

పినపాక, జనవరి 20, (ప్రభాతవార్త): మిరప పంటలలో అధిక దిగుబడులు ఇచ్చిన వివాంట సీడ్స్ జెస్సీ మిరప రకాల పంటల గురించి స్థానిక రైతులతో కలిసి కంపెనీ నిర్వాహకులు క్షేత్ర ప్రదర్శన చేశారు. కంపెనీ రీజనల్ మేనేజర్ కిశోర్ కుమార్ మాట్లాడుతూ మిరప పంటలో చీడపీడల నుంచి తట్టుకుని పూత, కాతలతో అధిక దిగుబడులు తమ కంపెనీ మిరప రకాలు సాధించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. మండల పరిధిలోని దూగినేపల్లి పంచాయతీ రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కామిశెట్టి మురళి రైతు వాడిన మిర్చి పంటకు సంబంధించి వివాంట సీడ్స్ జెస్సీ మిరప రకాలపై చుట్టు పక్కల గ్రామాల రైతులతో క్షేత్ర పరిశీలన చేయించడం జరిగింది. పంటను పరిశీలించిన 300 మందికి పైగా రైతులు ఈ సంవత్సరం వివాంట సీడ్స్ జెస్సి మిర్చి రకం అధిక పూత, కాయలతో మంచి దిగుబడులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు దేవేందర్, లోకేష్, డిస్ట్రిబ్యూటర్ అవని, ఏజెన్సీస్ నవీన్, కంపెనీ స్థానిక డీలర్ శ్రీ వెంకటేశ్వర ఎంటర్ ప్రైజెస్ బత్తుల నందకుమార్, బత్తుల ప్రణీత్, అండెం నాగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులు భరించలేక రైలుకిందపడి వ్యక్తి ఆత్మహత్య

రఘునాథపల్లి, జనవరి 20 (ప్రభాతవార్త): ఆర్థిక ఇబ్బందులు భరించలేక రైలుకిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రఘునాథపల్లిలో చోటుచేసుకుంది. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రఘునాథపల్లి మండలకేంద్రానికి చెందిన సిరికొండ నాగభూషణం కుమారుడు సిరికొండ మురళి(35) వృత్తిరీత్యా గోల్డ్‌స్మిత్ కావడంతో కొన్నేళ్లుగా మండలకేంద్రంలో లాస్య బంగారం దుకాణం నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈక్రమంలో అతనికి కొంత ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఏం చేయాలో దికుతోచని స్థితిలో అతను వెళ్లిపోయాడని తెలిపారు. శనివారం ఉదయం ఏడున్నర గంటల ప్రాంతంలో ఇంటినుంచి బయలుదేరిన మురళి నేరుగా రఘునాథపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకుని వరంగల్ వైపువెళ్లే గుర్తుతెలియని రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయాన్నే విధుల్లో ఉన్న రైల్వే కీమెన్ గమనించి స్టేషన్‌మాస్టర్‌కు సమాచారం అందించడంతో వెంటనే ఆయన జీఆర్‌పీ పోలీసులకు విషయం తెలియచేయగా సంఘటన స్థలానికి జీఆర్‌పీ పోలీసులు చేరుకుని మృతుడి వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ఇందు, కుమార్తె లాస్య, కుమారుడు అర్జున్ ఉన్నారు. దీనిపై జీఆర్‌పీ పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

గార్ల, జనవరి20 (ప్రభాతవార్త):



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం పిఆర్‌టియు మండల అధ్యక్షులు చింతనిప్పు రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మేజర్ పంచాయితీ సర్పంచ్ అజ్మీర బన్సిలాల్, ఎస్సై నిమ్మతోట జీనత్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని వారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పిఆర్‌టియు ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రభుత్వంతో పాటు సంఘం, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో మండల ఎంఎన్ఓ నంది వీరభద్రం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొట్ల నాగేశ్వరావు, పిఆర్‌టియు జిల్లా బాధ్యులు సురేందర్‌రెడ్డి, నాగేశ్వరావు, పెద్ది పద్మావతి, మండల కార్యదర్శి భూక్య రమేష్ రాథోడ్, మాజి ఎంఈఓ గుడి రాంప్రసాద్, తదితరులున్నారు.

# నామా అంటేనే అభివృద్ధి... నామాను మళ్లీ గెలిపించుకుందాం

**- ఆటో డ్రైవర్లకు నామా ముత్తయ్య ట్రస్టు ఆధ్వర్యంలో ఖాకీచొక్కాలు పంపిణీ**



కొత్తగూడెం, జనవరి 20 - (ప్రభాతవార్త): నామా అంటేనే అభివృద్ది అని, నామా బడుగు బలహీన వర్గాలు, పేదల పెన్నిది అని, నామాను మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఎంపీగా, ట్రస్టీగా ఆయన విస్తృతమైన సేవలు అందిస్తున్నారని నాయకులు కొనియాడారు. రుద్రంపూర్, గౌతంపూర్‌లో నామా ముత్తయ్య ట్రస్టు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు పెద్ద ఎత్తున ఖాకీ చొక్కాలు పంపిణీ చేశారు. పార్టీ బాధ్యులు మాట్లాడుతూ... ఉమ్మడి ఖమ్మం జిల్లా వాణిని పార్లమెంట్‌లో బలంగా వినిపిస్తూ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి పెద్ద ఎత్తున కృషి చేసిన నామా నాగేశ్వరరావును రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కూడా గెలిపించుకోవాలని అన్నారు. ఒక వైపు ఎంపీగా, మరోవైపు నామా ముత్తయ్య ట్రస్టు నుంచి భారీగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. నామా నాగేశ్వరరావును మళ్లీ గెలిపించుకోవడం ద్వారా మరింత అభివృద్ధికి అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఉమర్, సంకుబాపన అనుదీప్, చీకటి రాంబాబు, గుగులోత్ కృష్ణ, రవీందర్, గూడెల్లి యాకయ్య, మామిడి రాజేశ్వరరావు, బుచ్చయ్య, పాటి సుధాకర్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## పాల్వంచ వార్త

# విద్యార్థుల అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు



కొత్తగూడెం క్రైం, జనవరి 20 - (ప్రభాతవార్త): అశ్వాపురం మండలం చింతిర్యాల గ్రామానికి చెందిన రిమాలి ఉషోదయ అక్షయ్ కుమార్ (14 సంవత్సరాలు) హాస్టల్‌లో ఉంటూ పాత కొత్తగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. అయితే ఈ నెల 19వ తేదీన మధ్యాహ్నం పాఠశాల నుంచి యూనీఫాంలో సైకిల్‌పై కనిపించకుండా వెళ్లాడు. ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ సీఐ కరుణాకర్‌ను - 8712682017, 8712682019కు సంప్రదించాలని సూచించారు. కొత్తగూడెం సన్యాసి బస్తీకి చెందిన కుదుముల ప్రవీణ్‌కుమార్ రెడ్డి స్థానిక శివశివాని హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 19వ తేదీ నుంచి కనిపించడం లేదని తల్లి మౌనిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే వన్‌టౌన్ పరిధిలో ఇద్దరు పదవ తరగతి విద్యార్థుల అదృశ్యంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# కోలిండియా మాదిరిగా సింగరేణిలో సెలవు ప్రకటించాలి : మాధవ్‌నాయక్

కొత్తగూడెం, జనవరి 20 - (ప్రభాతవార్త): అయోధ్యలో శ్రీ రామ ప్రాణ ప్రతిష్ట మహోత్సవాన్ని జరుపుకోవడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని అనుసరించి కోలిండియా కూడా ఈ నెల 22వ తేదీ సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల వరకు సెలవును ప్రకటించిందని, అదే విధంగా సింగరేణిలో కూడా సెలవు ఇవ్వాలని ఏబీకేఎంఎస్ బీఎంఎస్ కార్యదర్శి, జేబీసీసీఐ మెంబర్ పి.మాధవ్‌నాయక్ డిమాండ్ చేశారు. కోలిండియా లిమిటెడ్‌ను అనుసరిస్తూ సింగరేణి కార్మికులకు జీతభత్యాలు, సేవలవులు మొదలైనవి అమలు చేస్తుందని, కావున సింగరేణి యాజమాన్యం కోలిండియా మాదిరిగా సింగరేణి ఉద్యోగులకు కూడా భగవాన్ సీతారాముడి ప్రాణ ప్రతిష్ట పర్వదిన పండుగను జరుపుకోవడానికి సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల వరకు సెలవు ప్రకటించాలని కోరారు. ఈ మేరకు యాజమాన్యానికి ఆయన లేఖను పంపించారు.

# పీఎం విశ్వకర్మ యోజన ఆన్‌లైన్ సెంటర్ ప్రారంభం

చుంచుపల్లి, జనవరి 20 - (ప్రభాతవార్త):



మండలంలోని రామాంజనేయకాలనీ గ్రామ పంచాయతీ పరిధిలోని గాంధీకాలనీలో పీఎం విశ్వకర్మ యోజన ఆన్‌లైన్ సెంటర్‌ను పీఎం విశ్వకర్మ జిల్లా స్క్రీనింగ్ కమిటీ మెంబర్ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు గౌడ్ ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని కుల వృత్తుల వారికి చేయూత ఇవ్వడం కోసం నరేంద్రమోడీ పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని పెట్టడం జరిగిందని, 70 ఏళ్లలో భారతదేశంలో ఏనాడూ కులవృత్తులను గుర్తించలేదని, మోడీ సారధ్యంలో అన్ని వర్గాలను గుర్తించి ఎన్నో పథకాలను ప్రారంభించి దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్న నరేంద్రమోడీకి రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నరేంద్రబాబు, రాయుడు నాగేశ్వరరావు, వల్లపు సాయిరాం, రంగు లక్ష్మణాచారీ, అపర్ణ, పెద్దోజు, మల్లాచారీ, భవాని, రామకృష్ణ, సుమలత పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాల్వంచ అర్బన్, జనవరి 20 - (ప్రభాతవార్త): పాల్వంచ, ఇందిరా కాలనీలో సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ లక్ష్మణ్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

# దగ్ధమైన మూడు వరిగడ్డి వాములను సందర్శించిన కొత్వాల

పాల్వంచ అర్బన్, జనవరి 20 - (ప్రభాతవార్త):



పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు వికలాంగుల కాలనీలో ముప్పల శ్రీనివాస్ అనే రైతు, తన ఇంటి పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో పశువుల మేత కోసం నిల్వ ఉంచిన సుమారు రూ.1.50 లక్షలు విలువైన మూడు వరిగడ్డి వాములు శుక్రవారం రాత్రి దగ్ధమైనాయి. డీసీఎంఎస్ వైస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు కొత్వాల శ్రీనివాసరావు దగ్ధమైన ప్రాంతాన్ని సందర్శించి తహసీల్దార్ నాగరాజుతో ఫోన్‌లో మాట్లాడారు. వరిగడ్డి వాములు ధ్వంసం పట్ల కొత్వాల రైతుతో చర్చించి విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, సొసైటీ డైరెక్టర్ కనగాల నారాయణరావు, కాంగ్రెస్ నాయకులు కందుకూరి రాము, పులి సత్యనారాయణ, బండి అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాంటేషన్ పేరుతో ఆదివాసీ భూములు లాక్కోవద్దు

**-ఆదివాసీ జీవన విధానం నాయకులు క్రాంతి**

ములకలపల్లి, జనవరి 20 (ప్రభాతవార్త) : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో ములకలపల్లి రేంజ్ పరిధిలో శనివారం అటవీశాఖ రేంజర్ రవికిరణ్ తన సిబ్బందితో కలిసి వలస ఆదివాసీల సాగుభూములను పరిశీలించారు. ప్లాంటేషన్ ఏర్పాటుకు వెసులుబాటు, భూముల లభ్యత, గురించి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా వలస ఆదివాసీల తరఫున ఆదివాసీ జీవన విధానం నాయకులు, జర్నలిస్టు పోతుగంటి క్రాంతి మాట్లాడుతూ ఆదివాసీల పంట భూములను ప్లాంటేషన్ కోసం తీసుకోవడం మంచిదికాదని ఫారెస్టు అధికారులను కోరారు. సాగుకు పనికిరాని భూములు ఉంటే గుర్తించి వాటిని సాగుదారులతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. మండలంలో ఉన్న అటవీ భూముల్లో కార్పోరేషన్ ఆధ్వర్యంలో సాగులో ఉన్న 8వేల ఎకరాలను అటవీశాఖ స్వాధీనం చేసుకోవాలని, లేదా గిరిజనులకు ఆ భూములపై హక్కులు కల్పించాలని కోరారు.



# టీపీయూఎస్ కాలమాని డైరీ ఆవిష్కరణ

జూలూరుపాడు, జనవరి 20 - (ప్రభాతవార్త):



తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) కాలమానిని, డైరీని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూలూరుపాడులో హెచ్ఎం లక్ష్మీ నరసయ్య, ఆర్.శ్రీనివాసరావుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఉపాధ్యాయులతో పాటు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోడ కృష్ణ కూడా పాల్గొని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ఉద్యోగ, ఉపాధ్యాయ బిల్లులన్నింటిని విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రకటించి ఉపాధ్యాయ, ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించిన వెంటనే అమలు పర్చాలని, అదే విధంగా బదిలీ పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి బదిలీ పొందిన స్థానాలకు పంపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# విద్యుత్ కార్మిక డైరీ ఆవిష్కరణ

పాల్వంచ అర్బన్, జనవరి 20 - (ప్రభాతవార్త):



తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ 142 నూతన సంవత్సర విద్యుత్ కార్మిక డైరీ, క్యాలెండర్‌ను, టేబుల్‌టాప్ క్యాలెండర్‌ను యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రామారావు ఆధ్వర్యంలో 5,6 దశలు, 7వ దశ సీఈలు పాలకుర్తి వెంకటేశ్వరరావు, మేక ప్రభాకర్‌రావులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు సీఈలకు డైరీలు, క్యాలెండర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసచారీ, సత్యరాజ్ స్టీవెన్, వెంపటి వెంకటేశ్వర్లు, షేక్ సయ్యద్, శివరాం, పుల్లారావు, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# బాలల సంరక్షణతో పాటు ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమాలు



- జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు



కొత్తగూడెం, జనవరి 20 - ప్రభాతవార్త: బాలల సంరక్షణతో పాటు వారి ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమం, తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు తెలిపారు. శనివారం ఐడీవోసీని సమావేశ మందిరంలో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా సమీక్ష సమావేశం జరిగింది. చైల్డ్ కేర్ ప్లాన్ కింద ప్రతీ మూడు నెలలకు ఒకసారి పిల్లల ఆరోగ్యం, వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలబాలికలకు స్కిల్ డెవలప్‌మెంట్ పరంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఏడుగురు బాల కార్మికులను రక్షించి బాల సదన్‌కు తరలించినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు ఇటలీకి ఇద్దరు, అమెరికాకు ఇద్దరు, ఇతర దేశాలకు 17 మంది పిల్లల్ని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పిల్లలు, దత్తత తీసుకునే తల్లిదండ్రుల ఆరోగ్య, ఆర్థిక పరిస్థితులు తనిఖీ చేసి సంతృప్తి చెందిన పిదప చట్ట ప్రకారం అన్ని విధివిధానాలు పూర్తి చేసి మొత్తం 19 మంది పిల్లల్ని వారి బంగారు భవిష్యత్తుపై ఉతనతమ కుటుంబాల తల్లిదండ్రులకు దత్తత ఇచ్చినట్లు సంక్షేమాధికారిణి విజేత తెలిపారు. బాల్య వివాహాల్ని అరికట్టడంలో భాగంగా 2017వ సంవత్సరంలో 18, 2018 సంవత్సరంలో 18 మంది, 2019 సంవత్సరంలో 29 మంది, 2020 సంవత్సరంలో 25 మంది, 2021 సంవత్సరంలో 17 మంది, 2022 సంవత్సరంలో 50 మంది, 2023 సంవత్సరంలో 50 మంది, 2024 సంవత్సరంలో ఇప్పటి వరకు 1 బాల్య వివాహాల్ని ఆపినట్లు చెప్పారు. మిషన్ వాత్సల్య స్కీం అనుసరించి తెలంగాణ రాష్ట్రం లోనే అత్యధికంగా 714 మందికి నెలకు రూ.4 వేల ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో పర్యటించి బాలికల పాఠశాలల్లో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయ్‌కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారిణి ఇందిర, మైనార్టీ వెల్ఫేర్ అధికారి సంజీవరావు, డీసీపీవో హరికుమారి, అసిస్టెంట్ లేబర్ అధికారి రవి, డబ్ల్యూసీ మెంబర్స్ సుమిత్ర, అంబేద్కర్, సాధిక్‌పాషా, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



## ఉత్సాహంగా దుమ్ముగూడెం ప్రీమియర్ లీగ్ -2 క్రికెట్ పోటీలు

దుమ్ముగూడెం, ప్రభాతవార్త : దుమ్ముగూడెం యువత ఆధ్వర్యంలో దుమ్ముగూడెం పీహెచ్‌సీ పక్కన ఉన్న క్రీడామైదానంలో జరుగుతున్న దుమ్ముగూడెం ప్రీమియర్ లీగ్ -2 క్రికెట్ పోటీలలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శనివారం జరిగిన క్రికెట్ పోటీలను సీఆర్‌పీఎఫ్ 141/ఏ బెటాలియన్‌కు చెందిన డీఎస్పీ రేవతి టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ .. క్రీడలు స్నేహభావాన్ని, దేహధారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని ఆమె అన్నారు. యువత క్రీడలతో పాటు విద్యలో రాణించాలని తద్వారా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వహక కమిటీ సభ్యులు, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ సిబ్బంది, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

## మారుమూల గ్రామాల్లో వైద్యశిబిరాలు

చర్ల ప్రభాతవార్త:



సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న తిప్పాపురం, గొరుకొండ గ్రామాలలో వైద్య శిబిరం నిర్వహించారు. చిన్న పిల్లలకి వ్యాధి నిరోధక టీకాలు వేశారు. 1 నుండి 40 సంవత్సరాముల వయస్సు 68 మందికి సికెల్ సెల్ అనేమియా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. 8 మందికి బీపీ, షుగర్ నిర్ధారించి చికిత్స చేశారు. శిబిరంను ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ చైతన్య సందర్శించారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఓ సత్యనారాయణ, హెచ్ఈఓ బాబురావు, ఎంఎల్‌హెచ్‌పి దీప్తి మౌనిక, హెల్త్ అసిస్టెంట్లు సుబ్బారావు, వేణు, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

# అగ్నిపత్ అగ్నివీర్ వాయు ఇంటేక్ ఎంపిక పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

- 12వ ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్‌వింగ్ కమాండింగ్ ఆఫీసర్ గుర్‌ప్రీత్ అత్వాల్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 20 - ప్రభాతవార్త: అగ్నిపత్ పథకం కింద అగ్నివీర్ వాయు ఇంటేక్ ఎంపిక పరీక్ష కోసం అవివాహిత పురుష, స్త్రీ అభ్యర్థుల నుంచి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు 12వ ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ వింగ్ కమాండింగ్ ఆఫీసర్ గుర్‌ప్రీత్ అత్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసేందుకు ఈ నెల 17 నుంచి వచ్చేనెల 6వ తేదీ వరకు అవకాశం ఉందని, మార్చి 17వ తేదీన ఆన్‌లైన్ పరీక్ష ఉంటుందని అన్నారు. రిజిస్ట్రేషన్ కోసం వెబ్‌సైట్‌లో అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని, 2004 జనవరి 2వ తేదీ నుంచి 2007జూలై 2వతేదీ మధ్య జన్మించిన వారై ఉండాలని, అభ్యర్థులు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన పరీక్షలో గణితం, ఫిజిక్స్, ఇంగ్లీష్‌లో సెంట్రల్, స్టేట్, యూటీ ద్వారా గుర్తించబడిన విద్యాలయాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో, ఆంగ్లంలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని అన్నారు. రిజిస్ట్రేషన్ అండ్ పరీక్ష రుసుము రూ.550 ఉంటుందని, ప్రవేశ స్థాయి అర్హత, వైద్య ప్రమాణాలు, నిబంధనలు, షరతులు, ఆన్‌లైన్ దరఖాస్తును పూరించడానికి సూచనలు, వివరణాత్మక సమాచారం కోసం వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

# అదనపు కలెక్టర్ మండల పర్యటన



ములకలపల్లి, జనవరి 20 ప్రభాతవార్త: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు శనివారం ములకలపల్లి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను తహశీల్దార్ పుల్లారావుతో కలిసి పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల వద్ద మంచినీటి సదుపాయంతో పాటు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, పోలింగ్ బూత్‌ల వద్ద సౌకర్యాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్ఐ తారాచంద్, వెంకటేశ్వర్లు, పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 20 - ప్రభాతవార్త: జవహర్ నవోదయ పాలేరులో 2024-25 సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాల కోసం శనివారం జరిగిన ప్రవేశ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వరచారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 9 సెంటర్లు ఏర్పాటు చేయగా మొత్తం 1325 మంది విద్యార్థులకు గాను 1045 మంది పాల్గొన్నారు. 280 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జేఎన్‌వీఎస్‌ఈ, 24 పాలేరు ఇంచార్జి కే.బ్రహ్మనందరెడ్డి, ఏసీజీఈ మాధవరావు, వివిధసెంటర్లను సందర్శించారు.



## నాగినేని ప్రోలు రెడ్డిపాలెం అభివృద్ధికి సహకరించాలి

-కాంగ్రెస్ నాయకులు

-సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పాయం

బూర్గంపహాడ్ ప్రభాతవార్త:



మండల పరిధిలోని నాగినేని ప్రోలు రెడ్డిపాలెం కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గ్రామంలో పలు సమస్యలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. గ్రామంలోని అంతర్గత రహదారులు, డ్రైనేజీ, పంట పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, మంచినీటి సాధుపాయం, చెరువుల పునరుద్ధరణ, విద్యుత్ లైన్లు, స్తంభాలుతో పాటు గ్రామంలోని ఇళ్ల మీదకు వెళ్లె 33 కెవి విద్యుత్ లైన్ ఇళ్లకు దూరంగా ఏర్పాటు చేసే విధంగా చొరవ చూపాలని స్థానిక యువతకి ఉపాధి ఉద్యోగ కల్పన తదితర విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పీఎసిఎస్ వైస్ చైర్మన్ ఆవుల నాగిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు ఎడమకంటి పిచ్చిరెడ్డి, ఎడమకంటి పెద్ద రోషి రెడ్డి, మాగినేని వెంకటేశ్వరరావు(ఎర్రబాబు), దుగ్గెంపూడి శేశిరెడ్డి, గాదె వెంకటేశ్వర రెడ్డి, పాలెం లక్ష్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రోత్సహిస్తే ప్రతిభ చాటుతా




-ఆర్చరీలో రాణిస్తున్న ఆదివాసీ విద్యార్థి
-ప్రతిభ ఉన్నా ప్రోత్సాహకం సున్నా
-ఆర్చరీ క్రీడా సామాగ్రి లేక అవస్థలు
-జాతీయ స్థాయి ఆర్చరీలో రాణిస్తున్న ఇర్ప ఆనంద్
-ఐటిడిఏ ద్వారా ఆదుకోవాలి

**దుమ్ముగూడెం, ప్రభాతవార్త :** భద్రాచలం ఏజెన్సీలోని దుమ్ముగూడెం మండలం మారుమూల గ్రామమైన దబ్బనూతలకొత్తూరుకు చెందిన ఒక ఆదివాసీ యువకుడు ఆర్చరీ క్రీడల్లో రాణిస్తూ జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో మెడల్స్‌ను సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ యువ క్రీడాకారుడికి మరింత ప్రోత్సాహకం అందిస్తే తన ప్రతిభను చాటుతానని, తద్వారా ఒలంపిక్స్‌లో జరిగే ఆర్చరీ పోటీల్లో భారతదేశం నుండి ఎంపికై ఒలంపిక్స్‌లో మెడల్స్ సాధిస్తాననే గట్టి నమ్మకం ఉందని, ఆ యువ క్రీడాకారుడు అంటున్నాడు. వివరాలలోకి వెళితే .. దుమ్ముగూడెం మండలంలోని ఛత్తీస్‌ఘడ్ సరిహద్దున ఉన్న దబ్బనూతలకొత్తూరు గ్రామానికి చెందిన ఇర్ప వెంకటేష్, కమల దంపతుల కుమారుడు ఇర్ప ఆనంద్ ఆర్చరీ క్రీడల్లో మక్కువతో ఆర్చరీలో నైపుణ్యాన్ని సాధిస్తున్నాడు. కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో ఆరవ తరగతి నుండి 10వ తరగతి వరకు చదివి ఆర్చరీ(విలు విద్య) పై మక్కువతో మెలకువలు నేర్చుకుని సాధన చేశాడు. తద్వారా సబ్ జూనియర్, జూనియర్స్ విభాగాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో తన ప్రతిభను చాటాడు. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న ఆనంద్ హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో శిక్షణ పొందుతున్నాడు. తమ కుమారుడు ఆర్చరీలో కనపరుస్తున్న ప్రతిభ, మక్కువకు ఆకర్షితులై తల్లిదండ్రులు, తమ కుమారుడు





ఆర్చరీ క్రీడలో నైపుణ్యం పెంపొందించేందుకు అప్పో, సొప్పో చేసి కొంత క్రీడాసామాగ్రిని కొనుగోలు చేశారు. అరకొర క్రీడాసామాగ్రితో తన ఇంటి గల తన స్వగ్రామంలోనే ప్రాక్టీస్‌ను చేస్తూ ప్రావీణ్యాన్ని పొందుతున్నాడు.

**-ఆనంద్ సాధించిన విజయాలు**

ఆర్చరీ క్రీడల్లో రాణిస్తున్న ఆనంద్ గతంలో సబ్ జూనియర్ విభాగంలోని జాతీయ స్థాయిలో మహారాష్ట్ర, రాజస్థాన్‌లో తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపికై పాల్గొన్నాడు. అలాగే జూనియర్ విభాగంలో తెలంగాణ రాష్ట్రం నుండి జాతీయ స్థాయిలో జరిగిన గోవా, రాజస్థాన్ ఆర్చరీ క్రీడల్లో సీనియర్ విభాగంలోని గుజరాత్‌లో ఎన్‌టీపీఎల్‌లో, హర్యానాలో ఆల్ ఇండియా ఇంటర్ స్థాయిలో పాల్గొని మెడల్ సాధించాడు. 40 మీటర్లలో గోల్డ్ మెడల్, 30 మీటర్లలో సిల్వర్ మెడల్, ర్యాంకింగ్‌లో గోల్డ్‌మెడల్, ఓవరాల్‌గా గోల్డ్‌మెడల్ సాధించి తన సత్తాను చాటాడు. ప్రస్తుతం గచ్చిబౌలిలో ఎస్ఏఐ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఆనంద్ తన స్వగ్రామానికి వచ్చినప్పుడు ఆర్చరీలో శిక్షణ పొందేందుకు సరైన సామాగ్రి లేక ఆవేదన చెందుతున్నాడు. ఆర్చరీ సామాగ్రిని కొనుగోలు చేయాలంటే సుమారు రూ.4లక్షల వరకు ఖర్చు అవుతుందని, అంత స్థోమత తన కుటుంబానికి లేదని, ప్రభాతవార్త ముందు ఆవేదన వ్యక్తం చేశాడు.

**-ఆర్చరీ యువ క్రీడాకారుడిని ప్రోత్సహించాలి**

రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబంలో పుట్టి ఆదివాసీ ఆర్చరీ యువ క్రీడాకారుడు ఇర్ప ఆనంద్‌కు ప్రోత్సాహకం అందిస్తే తన ప్రతిభను చాటుతాడు. ప్రతిభ ఉన్నా ప్రోత్సాహకం కరువైందని, ఆవేదన చెందుతున్నాడు. ఏజెన్సీలో ఇప్పుడిప్పుడే తన ప్రతిభను మెరుగు పరుచుకుంటున్న యువ క్రీడాకారుడు ఆనంద్‌కు స్వచ్ఛంద సంస్థలు కానీ, దాతలు ప్రోత్సహిస్తే ఆర్చరీలో మరింత ప్రతిభ కనపరిచి, ఏజెన్సీకే కాకుండా తెలంగాణ రాష్ట్రం, భారతదేశానికి కూడా పేరు ప్రతిష్టలు తీసుకువచ్చే అవకాశం ఉంది. తద్వారా ఆ యువ క్రీడాకారుడు భవిష్యత్తు కూడా బంగారు బాటలు వేసేందుకు పలువురు సహకరించాలని ఆ గ్రామస్తులు కోరుకుంటున్నారు. యువ క్రీడాకారుడిని ప్రోత్సహించే వారు 9110730083 నెంబర్‌కు సంప్రదించి క్రీడాకారుడిని ప్రోత్సహించి ఆర్చరీలో అతని ఎదుగుదలను ప్రోత్సహించాలని ఆయా గ్రామస్తులు కోరుకుంటున్నారు.



## వార్త దినపత్రిక చీఫ్ బ్యూరో వెంకట నర్సయ్యకు మాతృవియోగం

-నివాళులు అర్పించిన ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ

**ఖమ్మం కార్పొరేషన్, ప్రభాతవార్త :** వరంగల్,ఖమ్మం ఉమ్మడి జిల్లాల బ్యూరో చీఫ్ వెంకట నర్సయ్య మాతృమూర్తి ఇంజం దుర్గమ్మ (77) శుక్రవారం తుది శ్వాస విడిచారు. గత కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి శుక్రవారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. ఆమె మృతి సమాచారం తెలుసుకున్న ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ శనివారం ఉదయం బంగారయ్య నగర్ (వికలాంగుల కాలనీ)లో గల వెంకట నర్సయ్య నివాసంలో దుర్గమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఇంజం వెంకటనర్సయ్యను పరామర్శించి తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమె వెంట డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, టీఆర్ఎస్ నగర పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు ఉన్నారు.

## అండర్ 14 స్టేట్ క్రికెట్ టీం కెప్టెన్‌లుగా భద్రాచలం క్రీడాకారుడు



**భద్రాచలం అర్బన్, ప్రభాతవార్త :** ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్) ఆధ్వర్యంలో అండర్ 14 టీంకు ఎంపిక నిమిత్తం జరిగినటువంటి దాదాపు 5వేల మంది క్రీడాకారులలో 170 మంది క్రీడాకారులను ఎంచుకుని వారిని 10 జట్లుగా విభజించి అండర్ 14 స్టేట్ టీం కోసం మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ టీంలో భద్రాచలానికి చెందినటువంటి బెస్ట్ క్రికెట్ అకాడమీ క్రీడాకారులు ఎస్.గురువిద్వాన్ మణికంఠ ఒక జట్టుకు కెప్టెన్ బాధ్యతలు నిర్వహించడం విశేషం. ఎస్.గురువిద్వాన్, కే.మాన్విత్ అద్భుతమైన ప్రదర్శనతో స్టేట్ టీంకు ఎన్నుకోగా ఈ యొక్క సెలక్షన్‌లో స్టేట్ టీంలో దాదాపు హైదరాబాద్ క్రీడాకారులకు అధిపత్యం చెలాయించగా అటువంటి హైదరాబాద్ క్రీడాకారులపై భద్రాచలంకు చెందిన బెస్ట్ క్రికెట్ అకాడమీ క్రీడాకారులు విధ్వంసం సృష్టించి సెలక్షన్‌లో ముందున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ జిల్లాకు దొరకనటువంటి సెలక్షన్ కేవలం భద్రాద్రికొత్తగూడెం జిల్లాకు చెందిన భద్రాచలం బెస్ట్ క్రికెట్ అకాడమీ నుండి ఇద్దరు క్రీడాకారులు ఎంపిక ఇవ్వడం చాలా గొప్పయంగా ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ యొక్క అండర్ 14 స్టేట్ టీం జనవరి చివరి వారంలో గోవాలో జరగబోయే సౌత్‌జోన్ టోర్నమెంట్‌కు సన్నద్ధం అవుతుంది

## బీజేపీ ఆధ్వర్యంలో దేవాలయాల స్వచ్ఛ అభియాన్ కార్యక్రమం

**భద్రాచలం అర్బన్, ప్రభాతవార్త :** జనవరి 22న అయోధ్యలో రామమందిర ప్రాణ ప్రతిష్ట జరగనున్న నేపథ్యంలో దేశంలోని హిందూ దేవాలయాలను పరిశుభ్రం చేయాలని దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు దేవాలయాల స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు కాలనీలో గల సమ్మక్క సారలమ్మ దేవాలయంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కుంజా ధర్మారావు మాట్లాడుతూ .. దశాబ్దాల కాలం సమస్యగా ఉన్న అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ట జరుపుకోవడం సంతోషదాయకమని, రామమందిర నిర్మాణం ప్రజల చిరకాలవాంఛగా ఉందని, ప్రధాని మోడీ వల్ల ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. ప్రతి రోజు ఇంట్లో ఎలా శుభ్రంగా ఉంచుకుని పూజ చేస్తామో అలాగే దేవాలయాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రామమందిరాన్ని ప్రారంభిస్తున్న సందర్భంగా దేవాలయాలను శుభ్రం చేసే కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి రామ్మోహన్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన వెంకన్న, మండల కార్యదర్శి కనసాని శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి పీసీ కేశవ్, మండల ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, గద్దం శ్రీహరి, సూరత్ సుదర్శన్, ఏబీవీపీ నగర కార్యదర్శి అన్నం సాయిలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## జనవరి 22న సెలవు ప్రకటించాలి

-బీజేపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రావు



**భద్రాచలం అర్బన్, ప్రభాతవార్త :** ఈ నెల 22న అయోధ్యలోని రామమందిరంలో శ్రీ బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట చేస్తున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలకు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించాలని భారతీయ జనతా పార్టీ భద్రాచలం మండల అధ్యక్షుడు ములిశెట్టి రామ్మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. 500 సంవత్సరాలుగా కోట్లాది మంది హిందువులు అయోధ్యలో రామమందిర నిర్మాణం చేపట్టి రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట చేయాలని ఎదురు చూశారని, ఈ నెల 22న శుభ గడియలు వచ్చిన నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా విద్యా సంస్థలకు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా చికెన్, మటన్, చేపలు, తదితర మాంసాహారాలతో పాటు మద్యానికి దూరంగా ఉండాలని హైందవ సోదరులకు రామ్మోహన్‌రావు పిలుపునిచ్చారు. ఆ రోజున దేశవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొన్నదని, కావున తెలంగాణలో సెలవు ప్రకటించాల్సిందిగా, తద్వారా ప్రజలందరూ శ్రీబాలరాముని ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని వీక్షించే అవకాశాన్ని కలిగించగలరని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఆ రోజు అన్ని దేవాలయాల్లో పూజలు, ప్రసాద, అన్నదాన వితరణ సాయంత్రం దీపారాధన చేయనున్నట్లు తెలిపారు.




## మణుగూరు రైల్వేస్టేషన్ అధికారిని కలిసిన బీజేపీ నాయకులు

*మణుగూరు, ప్రభాతవార్త, జనవరి 20 :*



మణుగూరు రైల్వే స్టేషన్ అధికారిని మణుగూరు మండల బీజేపీ పార్టీ నాయకులు (రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యులు) శనివారం కలిసి నామినేటెడ్ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు రైల్వే అభివృద్ధి నామినేటెడ్ సభ్యులు, పట్టణ బీజేపీ అధ్యక్షులు లింగంపల్లి రమేష్, మండల అధ్యక్షులు కుంజా రామకృష్ణ, జిల్లా కార్యదర్శి ముత్యాల వెంకటేశ్వరరావు, మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## నాయిబ్రాహ్మణ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహణ

*అశ్వాపురం,జనవరి20,ప్రభాతవార్త.*



మండలంలోని నాలుగు గ్రూపుల నాయిబ్రాహ్మణ సంఘాలకు శనివారం మండలకమిటి పట్టణకమిటి సౌజన్యంతో జిల్లా బిసి అసిస్టెంట్ డవలప్మెంట్ ఆఫీసర్ శ్రీమతి విజయలక్ష్మి సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.నాలుగు సహకారసంఘాలకు ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి.ఎన్నికల నిర్వహణలో మండలకమిటి తరుపున అధ్యక్షులు మాడుగుల సమ్మయ్య ప్రధాన కార్యదర్శి యాసాని వెంకటరమణ పట్టణ కమిటి అధ్యక్షుడు జిల్లా కార్యవర్గసభ్యుడు లింగంపల్లి నాగేశ్వరరావు ప్రతినిధులుగా వ్యవహరించారు.ఎన్నికలలో నాలుగు గ్రూపుల సభ్యులందరూ పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటు నమోదు

**-సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వి.రాఘవరెడ్డి**

*మణుగూరు, ప్రభాతవార్త, జనవరి 20 :*




మణుగూరు మండల కేంద్రంలో శనివారం ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మణుగూరు తహసీల్దార్, సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వి.రాఘవరెడ్డి మాట్లాడుతూ 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందాలన్నారు. ఈ నెల 20, 21 న ఇందు కోసం స్పెషల్ క్యాంపెయినింగ్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటరు హెల్ప్ లైన్ యాప్ ద్వారా, స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో, మీ సేవా కేంద్రాల్లో సంప్రదించి ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. మృతి చెందిన వారి పేర్లు తొగించుకోవాల్సిన బాధ్యత ఉందని, ఒక్క చోట మాత్రమే ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఈ స్పెషల్ క్యాంపెయినింగ్ డే సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం వెబ్సైట్ లేదా 1950 టోల్ ఫ్రీ నెంబర్ సంప్రదించాలని కోరారు.

# ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించాలి

**-అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి**

**-మణుగూరు మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచాలి**

**-పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

*మణుగూరు, ప్రభాతవార్త, జనవరి 20 :*

ప్రతి ప్రజా సమస్యను వెంటనే పరిష్కరించేలా కృషి చేయాలని ప్రతి పేద వాడికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలు పథకాలు అందాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన శనివారం మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం (ప్రజాభవన్)లో పినపాక నియోజకవర్గంలోని



ఎంపీడీవో, ఎంపీవోలు, ఇరిగేషన్ శాఖ అధికారులు, మణుగూరు మున్సిపాలిటీ అధికారులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వెంటనే పూర్తయ్యేలా ఆయా శాఖల అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య అని ఎవరూ వచ్చినా వెంటనే అధికారులు స్పందించి పరిష్కరించేలా చూడాలన్నారు. మణుగూరు మున్సిపాలిటీలో సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఎక్కడా కూడా రోడ్డుపై, డ్రైనేజీల్లో చెత్త చెదారం కన్పించవద్దన్నారు. పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ సమస్యలు వెంటనే పరిష్కరిం చాలని ఎక్కడా కూడా సమస్య తలెత్తవద్దన్నారు. ఈ సమావేశంలో ఆయా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పినపాక ఎమ్మెల్యే పాయంను కలిసి ఎంపీపీ సుజాత

*మణుగూరు, ప్రభాతవార్త, జనవరి 20 :*



పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును శనివారం మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజాభవన్లో అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాత కలిసి తిరుపతి ప్రసాదం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల కో-ఆప్షన్ సభ్యులు ఎండీ షరీఫ్, ఎస్కే ఖదీర్, ఏనిక రవి, పొడియం అనిల్కుమార్, బొబ్బాల నాగేశ్వరరావు, చుంచు ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం

*మణుగూరు, ప్రభాతవార్త, జనవరి 20 :*



పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజాభవన్ ఆవరణలో బూర్గంపాడు మండలానికి చెందిన ధనలక్ష్మీ రైస్ మిల్లు యాజమాని పోతురెడ్డి వెంకటేశ్వరరెడ్డి నూతన ఫార్చునరన్ వాహనాన్ని స్వయంగా నడిపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి

*అశ్వాపురం,జనవరి20,ప్రభాతవార్త.*

మండలపరిధిలోని మొండికుంట ప్రభుత్వ పాఠశాలలో నేడు(ఆదివారం)నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని 18సంవత్సరాలు నిండిన యవతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని మొండికుంట సర్పంచ్ కమటం నరేష్ తెలిపారు.బూత్ లెవల్ ఆఫీసర్లు ఉదయం 10గంటలనుండి సాయంత్రం 5గంటలవరకు ఫారం 6,8లతో అందుబాటులో వుంటారని మార్పులు చేర్పులు సవరణలు చేసుకోవచ్చని తెలిపారు.

## గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**-మణుగూరు ఏరియా భద్రాద్రి స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలించిన జీఎం దుర్గం రామచందర్**

*మణుగూరు, ప్రభాతవార్త, జనవరి 20 :*



ఈ నెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ అన్నారు. ఆయన శనివారం మణుగూరు ఏరియా భద్రాద్రి స్టేడియం సందర్శించి గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఏరియా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికారులు ఈసం కృష్ణయ్య, డి.వెంకటేశ్వర్లు, ఎస్.రమేష్, శోభన్బాబు, ప్రవీన్, ప్రసాద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతంకు సైనికుడిలా పని చేయాలి

**-సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య చారి**

*మణుగూరు, ప్రభాతవార్త, జనవరి 20 :*



ప్రతి కార్యకర్త గ్రామస్థాయి నుండి పార్టీ బలోపేతంకు సైనికుడిలా పని చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యు బొల్లోజు అయోధ్య చారి అన్నారు. ఆయన శనివారం మణుగూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మణుగూరు మండల, పట్టణ పార్టీ కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవాలన్నారు. ప్రజలతో మమేకమై గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతంకు కృషి చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ పొత్తుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలన్నారు. రానున్న పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ క్యాడర్ సన్నద్ధం కావాలన్నారు. పార్టీ సభ్యత్వం త్వరగా పూర్తి చేసి గ్రామ కమిటీల నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో వహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీకుమారి, లక్ష్మినారాయణ, జంగం మోహన్రావు, దుర్గ్యాల సుధాకర్, వై.రాంగోపాల్, గోపిశెట్టి శివయ్య, సర్వర్, మంగి వీరయ్య, ఎడారి రమేష్, పాయం లక్ష్మయ్య, రామారావు, సోందె కుటుంబరావు, ఎస్వీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కమనీయంగా గోదారంగనాథుల కళ్యాణం



గార్ల, జనవరి20 (ప్రభాతవార్త):
మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవెంకటేశ్వరస్వామి గోదాదేవి అమ్మవారికి అంగరంగ వైభవంగా కళ్యాణం జరిపించారు. ధనుర్మాస ప్రతమహోత్సవాలు ముగింపును పురస్కరించుకొని ప్రతియేటా ఆలయంలో స్వామివారికి అమ్మవారికి ఘనంగా కళ్యాణం జరిపించడం ఆనవాయితీ. అర్చకులు రామాయణం అమృతానందా స్వామి, రామాస్వామి, యాదగిరి స్వామి, హర్షవర్థన్ స్వామి,లు శ్రీవేంకటేశ్వరస్వామి, గోదాదేవి అమ్మవారికి వేదమంత్రోత్సరణలతో అభిషేకాలు జరిపించారు. సన్నాయి మేళతాళాల నడుమ వివిధ రకాల పూలు, పూలమాలతో వైభవంగా అలంకరించిన కళ్యాణమండపంలోకి వేంచేపుచేశారు. ఈకళ్యాణ మహోత్సవంలో పర్చూరి కుటుంబరావు కనకమ్మ దంపతులు పీటలమీద కూర్చోని స్వామి, అమ్మవారలకు పట్టువస్త్రాలు, పూలు, పూలమాలలు, పసుపుకుంకుమ, పండ్లు సమర్పించగా అర్చకులు మంత్రోత్సరణాలతో అలంకరించారు. స్వామివారికి, అమ్మవారలకు విశ్వేకసపూజ, కంకణదారణ, కన్యాదానం చేసి జిలకర బెల్లం సమర్పించి కళ్యాణతంతు కమనీయంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో పుల్లఖండం రమేష్‌బాబు, రాంబాబు, వేమిశెట్టి శ్రీనివాస్ కవిత దంపతులు టిటిడి ధర్మ ప్రచార మండలి సభ్యులు మాళోత్ రాములు నాయక్ దంపతులు, అనుప్రియ, జక్కుల పాండురంగారావు, అద్దగిరి జనార్ధన్, రామారావు, పుల్లఖండం కవిత, కంఠం లక్ష్మీ, గాయత్రి, రేవతి, రమా, కళావతి, తదితరులు పాల్గొని కళ్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## కొండ కొమురయ్య కుటుంబానికి పిఆర్‌టియు ఆర్థికసహాయం

మహబూబాబాద్,జనవరి20,(ప్రభాతవార్త
ఇటీవల గుండెపోటుతో మరణించిన ఉపాధ్యాయుడు, పిఆర్‌టియు సీనియర్ కార్యకర్త కొండ కొమురయ్య కుటుంబానికి శనివారం పిఆర్‌టియు రాష్ట్రశాఖ అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు సంఘం క్రియాశీల సభ్యత్వ నిధి నుండి రూ.లక్ష రూపాయలను సంఘం జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ ఆధ్వర్యంలో కొమురయ్య సతీమణికి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన సభ్యుల కుటుంబానికి సహాయం చేయడమే గాక ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉండడం మా బాధ్యత అన్నారు. వారికి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ అందేవిధంగా చూస్తామని హామి ఇచ్చారు. కొమురయ్య మరణం పిఆర్‌టియు సంఘానికి తీరని లోటన్నారు. అనంతరం కొమురయ్య కుటుంబానికి ప్రగాఢసానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కల్లెం వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి భూక్య రామోజీనాయక్, రాష్ట్ర బాధ్యులు టి.మురళిధరస్వామి, హళ్యానాయక్, శ్రీధర్‌రెడ్డి, ఈశ్వర్‌కుమార్, జిల్లా బాధ్యులు శంకర్, శేఖర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు ఆర్థికసాయం

కురవి,జనవరి20,(ప్రభాతవార్త
మండలంలోని సుదనపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి, వీరభద్రస్వామి ధర్మకర్త మండలి సభ్యుడు కన్నెగంటి వెంకటరమణ-పద్మావతి దంపతులు తమ తల్లిదండ్రులు కన్నెగంటి వీరభద్రయ్య-సౌభాగ్యమ్మ, వారి బాబాయి తెలంగాణ సాయుధపోరాట యోధుడు కన్నెగంటి బద్రినారాయణల జ్ఞాపకార్థం ప్రతియేటా పాఠశాలకు రూ.3601 లను తాము జీవించి ఉన్నంతకాలం ఇస్తామని ప్రమాణం చేస్తూ పాఠశాలకు జీవితకాల ఆర్థిక వితరణ పత్రాన్ని కూడా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో పాటు ఉపాధ్యాయ బృందం వారిని అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రదీప్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం ప్రదీప్‌కుమార్, విజయ్, అంజద్‌పాషా, సంధ్యారాణి, సురేష్, అంగన్వాడి టీచర్లు జ్యోతి, నాగేంద్ర, పాల్గొన్నారు.

## భవన నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి : ఎంపీడీఓ

ఇల్లందు,రూరల్,జనవరి, (ప్రభాతవార్త20:
మండలంలోని మొండితోగు, తిలక్‌నగర్, విజయలక్ష్మినగర్, మిట్టపల్లి, రొంపేడు, కొమ్ముగూడెం పంచాయతీల్లో నిర్వహిస్తున్న నర్సరీలను ఎంపీడీఓ బాలరాజుశనివారం సందర్శించారు. ఈ సందర్భంగ మొక్కల పెంపకం విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగ ఆయన నిర్వాహకులతో మాట్లాడుతూ, వచ్చేది వేసవి కాలమని దీని దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలన్నారు. ఇదిఇలా ఉండగ పంచాయతీల్లో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ పనులను సంబందింత పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

## పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ



గార్ల, జనవరి20 (ప్రభాతవార్త):
జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం పిఆర్‌టియు మండల అధ్యక్షులు చింతనిప్పు రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మేజర్ పంచాయితీ సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, ఎస్సై నిమ్మతోట జీనత్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని వారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పిఆర్‌టియు ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రభుత్వంతో పాటు సంఘం, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఎన్ఓ నంది వీరభద్రం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొట్ల నాగేశ్వరావు, పిఆర్‌టియు జిల్లా బాధ్యులు సురేందర్‌రెడ్డి, నాగేశ్వరావు, పెద్ది పద్మావతి, మండల కార్యదర్శి భూక్య రమేష్ రాథోడ్, మాజి ఎంఈఓ గుడి రాంప్రసాద్, తదితరులున్నారు.

## ఈనెల25న వ్యాసరచన పోటీలు

గార్ల, జనవరి20 (ప్రభాతవార్త):
ఈనెల25న మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించబడునని తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్రకార్యదర్శి గంగావత్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు భారతదేశం ఎన్నికలు సంస్కరణలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించబడునని అత్యధికంగా విద్యార్థులు పాల్గొని వ్యాసరచన పోటీలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## మానవత్వం నిండుగా.. సేవలు మెండుగా



మహబూబాబాద్,జనవరి20,(ప్రభాతవార్త
అయోధ్యలో జరుగనున్న రామ ప్రాణప్రతిష్ట సందర్భంగా ఆధ్యాత్మిక సేవాభావంపరిడవిల్లుతుందని, మానవ సేవే మాధవ సేవ అని వికాస తరంగిణి జిల్లా కోశాధికారి, ఆర్యవైశ్య మహాసభ రీజియన్ చైర్మన్ కొండ్లె వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆధ్యాత్మికసేవలు తెలియక భక్తి మార్గానికి దూరంగా ఉంటున్న అట్టడుగు వర్గాల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్నిపెంపొందింపజేస్తున్న దళితహిందు పరిషత్ జిల్లా అధ్యక్షురాలు ఇరుకుళ్ల లక్ష్మి, ప్రధానకార్యదర్శి లింగంపెల్లి సుగుణలకు నూతన వస్త్రాలు అందజేసి సత్కరించారు. అట్టడుగు వర్గాల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపి వారిని దైవ కార్యాలకుదగ్గర చేస్తున్న డిహెచ్‌పి సేవలు అభినందనీయమన్నారు. 20రోజులుగా ఊరూరా పూజిత అక్షింతల పంపిణీ, శ్రీరామ జాగరణ యాత్రద్వారా అనేక సామాజిక, స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తుండడం ప్రశంసనీయం అన్నారు. పలు వార్డుల్లో ప్రచార నిర్వహణ నిమిత్తం శ్రీరామ ముద్రిత జెండాలు కొండ్లెవీరకుమారి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో చిదిరాల సర్వేశ్వర్, పాపారావు, నాగేంద్ర, ప్రదీప్, మహిపాల్‌రెడ్డి, భాస్కర్, శ్యామ్, యశోద, ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లెందు వార్త



## ఘనంగ లెనిన్ శత వర్ధంతి వేడుకలు



ఇల్లందు,అర్బన్,జనవరి, (ప్రభాతవార్త20:
ప్రపంచంలోని సామ్రాజ్యవాద యుద్దాన్ని అంతర్యుద్దంగ మార్చి విప్లవ విజయాన్ని సాధించగలిగింది లెనిన్ ఒక్కరే అని ఓయు ప్రొఫెసర్ ఖాసీంఅన్నారు. శనివారం ఆపూనూరి మధు అధ్యక్షతన జరిగిన లెనిన్ శత వర్ధంతి వేడులక సభలో పాల్గొని మాట్లాడుతూ, 13 ఏళ్ళ లెనిన్ నాయకత్వంలో రరష్యాను మిముక్తి చేసి ప్రపంచానికి మార్గదర్శకంగ నిలిచారన్నారు. ప్రపంచానికి రష్యా ఒక కమ్యూనిస్టు సెంటర్‌గా ఉండేదని నేడు కమ్యూనిజం ఎక్కడ ఉందో వెతుక్కోవాల్సి వస్తుందన్నారు. ఏది ఏమైన లెనిన్ చూపిన మార్గాన్ని నేటి కమ్యూనిస్టు నాయకులు పాటిస్తేనే ప్రజా సమస్యలపై పోరాటం చేయగలమన్నారు. ఇదిఇలా ఉండగ ఆయన వర్ధంతి సందర్భంగ నివాలిర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీ నాయకులు బండారి ఐలయ్య, తుపాకుల నాగేశ్వరరావు, నరసింహారావు, ఉదయ్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ




ఇల్లందు,అర్బన్,జనవరి, (ప్రభాతవార్త20:
ఇల్లందు సింగరేణి ఏరియా పనిచేస్తున్న ఎస్టీ ఉద్యోగుల సంఘానికి సంబంధించిన క్యాలేండరును జీఎం జాన్ ఆనంద్ శనివారం వారి కార్యాలయంప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగ అ సంఘం నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు మల్లారవు మల్లయ్య, మోహన్‌రావు, క్రిస్టఫర్, నాగేశ్వరరావు, సంఘం ఇల్లందు ఏరియా అధ్యక్షుడు వాంకుడోత్ కిషన్, దరియా సింగ్, రవి, కిషోర్ వీరన్న, లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక నోటిఫికేష్ విడుదల

ఇల్లందు,రూరల్,జనవరి, (ప్రభాతవార్త20:



ఈ ఏడాదికి సంబందించిన పాఠశాలయాజమాన్య కమిటి ఎన్నికల షెడ్యూల్‌ను ఎంఈఓ పిల్లి శ్రీనివాస్ శనివారం విడుదల చేశారు. 20 తేదిమధ్యహన్నం 2 గంటలకు ఓటరు జాబితా ప్రకటన, 22వ తేది నుంచి 23వ తేది వరకు అభ్యంతరాలు స్వీరణ, 24వ తేదిన తుది ఓటరుల జాబితాప్రకటన, 29తేది ఉదయం 7 గంటల నుంచి మధ్యహన్నం 1 గంట వరకు పోలింగ్, అదే రోజు మధ్యహన్నం 1:30గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్‌ఎన్నిక, 2 గంటలకు మొదటి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

# నవ సమాజ నిర్మాణానికి నాంది విద్యార్థులే

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

అశ్వారావుపేట రూరల్, ప్రభాతవార్త: నవ సమాజ నిర్మాణానికి నాంది పలికేది విద్యార్థులేనని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేకువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డవలప్ మెంట్ ప్రోగామ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జారె మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చి దిద్దాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రత్యేక కార్యక్రమానికి నేను సంకల్పించినట్లు తెలిపారు. విద్యార్థులు తరగతి గదిలో ఉపాధ్యాయులు ఎంత చెప్పినప్పటికి ఇంకా ఏదో కావాలని కోరుకుంటారని అన్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు లక్ష్య సాధన, మానవతా విలువలు, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి వంటి



వాటిపై మెళుకవలను ఈ కార్యక్రమం ద్వారా తెలియపర్చడం జరుగుతుందని ఈనెల 25 వరకూ పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన ఎన్ఆర్ఐ వీరమనేని పూర్ణచంద్రశేఖర్‌కు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తాను ఒక మెంటర్‌ని అని పాఠశాలల్లో జరిగే ఈ కార్యక్రమాల్లో తాను స్వయంగా పాల్గొనడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెన్నకేశవరావు, డిసిసిబి చైర్మన్ నిర్మల పుల్లారావు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మిరప కాయలను కోసి కల్లాలలో ఎండబెట్టాలి

**ఎండిన కాయలను టార్పాలిన్‌తో కప్పాలి**

**11శాతం తేమ వచ్చే వరకు ఎండబెట్టాలి**

**ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో తారాదేవి**

కామేపల్లి, జనవరి 20 ప్రభాతవార్త: మిరప కాయలను కోసిన తరువాత రైతులు కల్లాలలోనే ఎండబెట్టాలని ఖమ్మం వ్యవసాయ శాఖ ఏడీఏ ఏ.శ్రీనివాసరావు, కామేపల్లి వ్యవసాయ అధికారి బి.తారాదేవి కోరారు. మండల పరిధిలోని ముచ్చర్ల, మద్దులపల్లి, కామేపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మిర్చి రైతులు అమ్మకంలో అధిక దిగుబడులు పొందడానికి మిర్చి కోత అనంతరం పాటించవల్సిన నాణ్యత ప్రమాణాలపై రైతులకు శనివారం వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. మిర్చి కాయ కోత, ఎండబెట్టుటలో మెలకువలు పాటించాలని పూర్తిగా పండిన మిర్చి కాయల్ని మాత్రమే కోయాలని, కాయ కోతకు 20రోజుల ముందు నుంచి పురుగు మందుల పిచికారి చేయరాదని అన్నారు. అపరిశుభ్రమైన



ఎరువుల సంచుల్ని కోతకు వినియోగించరాదని, కోసిన కాయల్ని టార్పలిన్ షీట్ లేదా సిమెంట్ కల్లాల మీద ఎండబెట్టినచో వేగంగా ఎండి నాణ్యత కలిగి ఉంటాయన్నారు. తెగులు సోకిన తాలు, దెబ్బతిన్న, తక్కువ రంగు కలిగిన కాయల్ని ఏరి గ్రేడింగ్ చేసుకోవాలని, మిరపకాయలు అధిక తేమ ఉండినట్లయితే అఫ్లాటాక్సిన్ సోకే ప్రమాదం ఉందని సూచించారు. 11శాతం తేమ వచ్చేవరకు ఎండనివ్వాలని, టిక్కిల్లో నింపే ముందు మిరపకాయలపై నీటిని చిలకరించరాదని, నాణ్యత ప్రమాణాల్ని పాటించి రైతులు అధిక లాభాల్ని పొందాలని కోరారు. క్షేత్రస్థాయిలో నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో ఏఈవోలు బి.జగదీశ్వర్, బి.మహేష్, శ్రీకన్య, కె.ప్రతిభ, ఉష, షేక్ మున్ని, రైతులు మేకల సైదులు, మేకల రమేష్, దొడ్డ సైదులు, దొడ్డ దర్గయ్య, నల్లమోతు రవి, మేకల అచ్చమ్మ, కంపసాటి జెన్నీ, గడ్డం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# కామేపల్లిలో పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్

కామేపల్లి, జనవరి 20 ప్రభాతవార్త: కామేపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసుదన్‌నాయక్ శనివారం సందర్శించారు. 227, 228, 229 కేంద్రాలను సందర్శించి ఓటరు నమోదు వివరాలను బిఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. శని, ఆదివారాలలో నూతన ఓటరు నమోదు, సవరణ కోసం ప్రత్యేక క్యాంప్ నిర్వహిస్తున్నట్లు



తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెవిన్యూ కార్యకలపాలను తహశీల్దార్ సిహెచ్ సుధాకర్, సిబ్బందితో సమీక్షించారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం వివరాలను సైతం అడిగి తెలుసుకోన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సీహెచ్ సుధాకర్, డీటీ శంకర్, ఏఎస్‌వో సైదులు, బిఎల్‌వోలు పెండ్ర అనిల్‌కుమార్, హట్కార్ పార్వతి, డి.వసంత, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించాలి

కామేపల్లి, జనవరి 20 ప్రభాతవార్త:



కామేపల్లిపరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించాలని పంచాయితీ కార్యదర్శి పెండ్ర అనిల్‌కుమార్ శనివారం కొత్తలింగాల ట్రాన్స్‌కో ఏఈ ఎన్.శ్రీనివాసులును కోరారు. అ మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసి, చలానా తీశారు. ధరఖాస్తులను, చలానాలను ఏఈ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక లైన్ ఇన్స్పెక్టర్ శంకర్, లైన్‌మెన్ ముడిక శ్రీనివాస్, జూనియర్ లైన్‌మెన్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 33కెవి లైన్‌లో మరమ్మత్తులు

**నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం**

కామేపల్లి, జనవరి 20 ప్రభాతవార్త: ఖమ్మం నుంచి కామేపల్లి మండలం కొత్తలింగాల, ముచ్చర్ల సబ్ స్టేషన్‌కు వచ్చే 33కెవి లైన్‌లో మరమ్మత్తులు ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వ్యవసాయ రంగానికి (త్రీఫేస్) కరెంట్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని కొత్తలింగాల ట్రాన్స్‌కో ఏఈ ఎన్.శ్రీనివాసులు శనివారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని పండితాపురం ఫీడర్, కొత్తలింగాల టౌన్ ఫీడరు, గోవింద్రాల టౌన్ ఫీడర్, పాతలింగాల ఫీడర్, ముచ్చర్ల, జాస్తిపల్లి టౌన్ ఫీడర్, సాతానిగూడెం ఫీడర్, బాసిత్ నగర్ ఫీడర్, మద్దులపల్లి ఫీడర్లకు చెందిన రైతులు, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.




## వినాయకపురంలో 22న ప్రతిష్ఠా విగ్రహాల ఊరేగింపు



అశ్వారావుపేట రూరల్, జనవరి 20 ప్రభాతవార్త: మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరాముని ఆలయంలో ప్రతిష్ఠించే విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం ఈనెల 22న జరుగుతుందని నిర్వహణ కమిటి పేర్కొంది. సోమవారం అయోధ్య రామ మందిరంలో ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందని అదే రోజున మధ్యాహ్నం వినాయకపురం గుడిలో ప్రతిష్ఠించే స్వామివార్ల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొస్తారని తెలిపారు. ఇట్టి ఊరేగింపును కోలటం, భజన బృందం సభ్యులతో నిర్వహించడం జరుగుతుందని కావున ఊరేగింపులో పాల్గొని స్వామివార్లను దర్శించుకోవాలని స్వామివారి కృపకు పాత్రులు కావాలని శ్రీరామ భక్త బృందం కోరింది.

## పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్



అశ్వారావుపేట రూరల్, జనవరి 20 ప్రభాతవార్త: మండలంలోని పోలింగ్ కేంద్రాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ కలెక్టర్, అశ్వారావుపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి రాంబాబు తనిఖీ చేశారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతున్న నేపధ్యంలో ఊట్లపల్లి, నారాయణపురం పోలింగ్ కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ది.01.01.2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన నూతన ఓటర్లు ఓటు హకున నమోదు చేసుకోవాలని అన్నారు. అదే విధంగా చనిపోయిన ఓటర్ల కుటుంబ సభ్యుల నుండి ఫారం 7 దరఖాస్తు తీసుకొని వారిని ఓటర్ల జాబితా నుండి తొలగించాలని ఆదేశించారు. తప్పులు లేని ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణప్రసాద్, డిటి రామకృష్ణ, బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పీ హైస్కూల్‌లో స్కిల్ డవలప్ మెంట్ ప్రోగ్రామ్



అశ్వారావుపేట అర్బన్, జనవరి 20 ప్రభాతవార్త: వేకువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రం అశ్వారావుపేటలో గల బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కిల్ డవలప్ మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పలు అంశాలపై నైపుణ్య శిక్షణా కార్యక్రమం జరిపి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పోటీ ప్రపంచంలో లక్ష్యాలను ఏ విధంగా సాధించుకోవాలో అధ్యాపకులు చంద్రశేఖర్ వివరించారు. విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెన్నకేశవరావు, సత్యనారాయణ చౌదరి, రాంబాబు, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యచంద్రికకు ల్యాప్టాప్ వితరణ

వైరా,జనవరి20,(ప్రభాతవార్త):
ఆర్థికంగా వెనుకబడిన బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడంలోను భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడంలోను వారి కలలు నెరవేర్చడంలో లయన్స్‌క్లబ్ వైరా ఎల్లవేళలా కృషి చేస్తుందని వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్2 నంబూరు మధు, ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అన్నారు. లయన్స్‌క్లబ్ వైరా అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్రరావు అధ్యక్షతన స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు బిటెక్ పూర్తి చేసుకొని ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తూ ల్యాప్టాప్ అవసరాన్ని గుర్తించిన వైరాలోని రాజశేఖర్‌నగర్‌కు చెందిన నిరుద్యోగిని వాడపల్లి దివ్యచంద్రికకు రూ.40వేలు విలువ చేసే ల్యాప్టాప్ కంప్యూటర్ మురళీకృష్ణ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో జీఎంటి కోఆర్డినేటర్ యు.శ్యామ్‌బాబు, రీజియన్ చైర్మన్ లగడపాటి ప్రభాకర్‌రావు, చింతోజు నాగేశ్వరరావు, కొల్లా రాంబాబు, మరికంటి రాంగోపాల్, తాటికొండ రాము, రాయపూడి నారాయణ, మచ్చా రామారావు, గద్దె నీరజ, చెరుకూరి శ్రీనివాసరావు, శీలం పిచ్చిరెడ్డి, గుర్రం సీతాసుమతి, వాడపల్లి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఆరు గ్యారంటీలపై దృష్టి సారించాలి: వేములకొండల రమేష్

కొణిజర్ల,జనవరి20,(ప్రభాతవార్త):



మండల పరిధిలో గల గొబ్బగుర్తి గ్రామంలో సిపిఐ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన శాఖ సమావేశంలో మండల కార్యదర్శి వేములకొండ రమేష్ మాట్లాడుతూ పార్టీ నిర్మాణం, పార్టీ సభ్యత్వాలు త్వరగా పూర్తి చేయాలని ఆయన మండలంలో అన్ని గ్రామాల పార్టీ కార్యదర్శులకు తెలిపారు. అనంతరం సిపిఐ పార్టీ మిత్రపక్షం అయిన కాంగ్రేస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని వంద రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు బహుమతిగా ఇవ్వాలని కోరారు. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేక హామీలన్నీ తుంగలో తొక్కిన విధంగా కాకుండా కాంగ్రేస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు కావాల్సిన ప్రతి అవసరాన్ని తీర్చే విధంగా ప్రభుత్వం పనిచేయాలని బడుగు బలహీన దళిత గిరిజన కార్మిక వర్గాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని ఆయన సూచించారు. కొణిజర్ల మండలంలో పలు రహదారుల్లో వంతెనలు చాలా ఇబ్బందిరకంగా ఉన్నాయని, ఆ సమస్యను స్థానిక ఎమ్మెల్యే స్పందించి వెంటనే మరమ్మత్తులను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు పాపగంటి సుదర్శన్, దుబ్బనబోయిన శేషయ్య, దుబ్బనబోయిన వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం వితరణ



కారేపల్లి, జనవరి 20, (ప్రభాతవార్త :
సింగరేణి మండలం గుంపెళ్ళగూడెం గ్రామానికి చెందిన బాధావత్ కృష్ణ ఇటీవల మృతిచెందడంతో ఆ కుటుంబానికి కాంగ్రెస్ నేతలు బియ్యాన్ని శనివారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్‌నాయక్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నేతలు బానోతు వీరన్న, చక్రం, ధారావత్ వినోద్‌లు పరామర్శించి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.అనంతరం ప్రభుత్వం నుండి ఏమైనా సహాయ సహకారాలు కావాలన్నా ఎమ్మెల్యే తన వంతు సహకారం అందిస్తారని బాధిత కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బానోత్ రాములు, బానోత్ అశోక్, లకావత్ జయరాం, బానోత్ కిషన్, బానోత్ లక్ష్మ, బానోతు సీతారాములు, బానోతు భార్య, బానోత్ రవి, దారావత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



కారేపల్లి,జనవరి 20, (ప్రభాతవార్త :
తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం 2024క్యాలెండర్‌ను కారేపల్లి సీఐ తిరుపతిరెడ్డి శనివారం ఆవిష్కరించారు. సీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తిరుపతిరెడ్డి మాట్లాడుతూ... వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ పాటుపడే విధంగా ఉండాలని సీఐ సూచించారు. ప్రభుత్వం నేడు కార్మిక సంక్షేమానికి కల్పిస్తున్న ప్రయోజనాలను ప్రతి ఒక్కరికి అందేలా చూడాల్సిన బాధ్యత కార్మిక సంఘంపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు బాదావత్ శ్రీనివాస్, దాసరి మల్లయ్య, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.




## సదరం సర్టిఫికెట్స్ స్లాట్ బుకింగ్ ఫిబ్రవరి 13, మార్చి 26న క్యాంపులు

కారేపల్లి, జనవరి 20, (ప్రభాతవార్త :
సదరన్ సర్టిఫికెట్ల కోసం ధరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు ఫిబ్రవరి 9, మార్చి 26న సదరన్ క్యాంపులు నిర్వహిస్తున్నారని ఎంపీడీవో చంద్రశేఖర్ శనివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ.... దివ్యాంగ నిర్ధారణ పరీక్షల కోసం మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని నిర్ణయించిన తేదీల్లో దివ్యాంగులు జిల్లా ఆరోగ్య కేంద్రానికి వెళ్ళాలని అన్నారు. సింగరేణి మండల పరిధిలోని ప్రజలకు సదరం క్యాంపు ఫిబ్రవరి 9న ఉదయం 11గంటలకు మీ సేవలో ఆన్‌లైన్ స్లాట్ అందుబాటులో ఉండగా, ఈ స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగులకు ఫిబ్రవరి 13న జిల్లా ఆరోగ్య కేంద్రంలో సదరం క్యాంపు నిర్వహణ ఉంటుందన్నారు. మరల మార్చి 21నాడు ఆన్‌లైన్ స్లాట్ అందుబాటులో ఉండగా, మార్చి 23న సదరన్ క్యాంపు నిర్వహణ ఉంటుందని తెలిపారు. కొత్తగా దివ్యాంగ పరీక్షల కోసం వచ్చే వారు ఆధార్ కార్డుతో యపాటు టెంపరరీ సర్టిఫికెట్ కలిగి ఉండి రెన్యూవల్ కోసం స్లాట్ బుక్ చేసుకోవాలనుకునే వారు పాత సదరం ఐడీ నెంబరుతో మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని కోరారు. మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకున్న ధరఖాస్తుదారులకు మాత్రమే సదరం క్యాంపులో డాక్టర్ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మండల పరిధిలోని దివ్యాంగులు ఈ సదరం క్యాంపులను ఉపయోగించుకొని ఆసరా పించన్లు పొందవచ్చని ఎంపీడీవో తెలిపారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని ప్రమీలకు ఆర్థిక సహాయం



కారేపల్లి,జనవరి 20, (ప్రభాతవార్త :
ఇటీవల కారేపల్లిలో వాహన ప్రమాదంలో గాయపడిన సీఆర్పీ ప్రమీలకు తెలంగాణ ట్రైబల్ టీచర్ ఫెడరేషన్ శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మండల రిసోర్స్ సెంటర్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రమీల గత 10రోజుల క్రితం కారేపల్లిలో తహశీల్దార్ కార్యాలయం వద్ద తీవ్ర గాయాలైయ్యాయి. కాలు ఫ్యాక్చర్ జరిగింది. అసలే చాలీచాలని జీతంతో కుటుంబం గడుపుతున్న ప్రమీలకు టీఎస్‌టీటీఎఫ్ సింగరేణి మండల శాఖ చలించిపోయి తన వైద్య ఖర్చుల కోసం నాయకులు, సభ్యుల ద్వారా రూ. 14వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల విద్యాశాఖాధికారి దుగ్గిల జయరాజు, రాష్ట్ర కోశాధికారి బానోత్ శ్యామ్‌లాల్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు బానోత్ మంగ్యానాయక్, ఖమ్మం జిల్లా గౌరవాధ్యక్షులు కేలోత్ రాములునాయక్, సింగరేణి మండల వృద్ధులు, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ అజ్మీర వీరునాయక్, సింగరేణి మండల గౌరవాధ్యక్షులు బానోత్ మంగీలాల్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

వైరా,జనవరి20,(ప్రభాతవార్త):



టిపిసిసి కార్యదర్శి కట్ల రంగారావు ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాలోతు రాందాస్ నాయక్ ప్రారంభోత్సవం చేశారు. మున్సిపాలిటీ చైర్మన్ సూతకాని జైపాల్, కట్ల సంతోష్, పోదిల హరినాథ్, యడ్లపల్లి వీరయ్యచౌదరి, నంద్రు నాగరాజు, ఫణితి శ్రీను, చెరుకూరి కిరణ్, వల్లపు కొండలరావు, కర్నాటి హనుమంతరావు, జవ్వాజి నాగరాజు, షేక్ ఇస్మాయిల్, మండల నాయకులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# రైతులు కల్లాల్లో ఆరబోసిన మిర్చిని పరిశీలించిన ఏవో బాలాజి

## ఆరుదల మిర్చికే మార్కెట్‌లో గిరాకి మిరపలో తెగుళ్ళపై రైతులకు పలు సూచనలు

కొణిజర్ల,జనవరి20,(ప్రభాతవార్త):
జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండల వ్యవసాయశాఖ అధికారి బాలాజి చిన్నగోపతి, అమ్మపాలెం గ్రామాల్లో రైతులు కల్లాల్లో ఆరబోసిన మిర్చీని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు మిర్చి తోటల నుండి కోసిన మిర్చిని మంచి నాణ్యతగా



ఉన్న మిర్చిలో మంచి గిట్టుబాటు ధర వస్తుందని రైతులు కొందరు మిరప చేనులో మిరప కోసి రైతులు అప్పుడే మిర్చిని కోసే సమయంలో మంచి మిర్చిని ఆదేవిధంగా తాలు మిర్చిని వేర్వేరుగా కోపిస్తున్నారని, దీనివలన కొంచం సమయం పట్టినా రైతులకు డబ్బులు ఆదా అవుతుందని, అనంతరం కోసిన మిర్చిని రైతులు టార్పాలిన్ మీద కాని, డ్రయింగ్ ప్లాట్ ఫార్మ్ మీద కాని ఎండపెట్టుకోవాలని, రైతులు ఒక క్వింటా పండు మిరపకాయలు ఎండపడితే అవి ఎండినాక 10 కేజీలు ఎండు మిరప కాయలు అవుతాయని, కొన్ని కంపెనీలను బట్టి ఒకటి, రెండు కేజీలు పెరగవచ్చునని, మిరపకాయలు ఎండినవి అని తెలుసుకోవడానికి మిరపకాయలు ఎండినట్టు అనుకోవాలని అన్నారు. తర్వాత ఒకరిద్దరు కూలీలను పెట్టుకొని తాలు మిరపకాయలను, మచ్చలు ఉన్న మిరపకాయలను సపరేట్ చేసి మంచిగా ఉన్న ఎండు మిరపకాయలను మార్కెట్‌లోకి తీసుకొని వెళ్లాలని అన్నారు. ఈ సంవత్సరం తుఫాన్ తర్వాత మిరపలో కాయ మచ్చ, తాలు బాగా పెరిగిందని, కావున దిగుబడులు తగ్గాయని, అందుకే కొందరు రైతులు మంచి మిరపకాయలు, తాలు సపరేట్ చేయకుండా మార్కెట్‌లోకి తీసుకొని వెళుతున్నారని, దీనివలన మంచి ధర రావడం లేదని రైతులు ఇబ్బందిపడుతున్నారని అన్నారు. కావున సపరేట్ చేసి మార్కెట్‌కి తీసుకొని వెళ్లి మంచి ధరకు అమ్ముకోవాలని, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బాలాజీ, ఏఈవో శ్రీనివాసరాజు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే కఠినచర్యలు
- రాత్రి గం. 10.00 దాటితే షాపులన్నీ క్లోజ్ చేయాలి
- రూరల్ సిఐ హనూక్

*కల్లూరు, జనవరి 20, ప్రభాతవార్త*

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి రూరల్ సీఐ హనూక్ పేర్కొన్నారు. శనివారం కల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో అనేక రకాలుగా అమాయక ప్రజలకు ఆశ్యాలు చూపిస్తూ గుర్తు తెలియని వ్యక్తులు నేరాలకు పాల్పడుతూ నగదు లావాదేవీలు జరుపుతున్నారని, ఆన్‌లైన్ మోసాలకు తమ విలువైన సంపాదన ద్రవ్యాన్ని వృధా చేసుకోకూడదని, ఒక వేళ ఎవరైనా తమ డబ్బులు ఆన్‌లైన్ మోసాల్లో పోగొట్టుకున్నట్లైతే



1930 కి ఫోన్ చేసి కేసు నమోదు చేసుకోవాలని వారు తెలిపారు. అదే విధంగా ప్రస్తుత రోజుల్లో చైన్ స్నాచింగ్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాహనాలకి సరైన నెంబర్ ప్లేట్లు వాడకుండా ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ, డూప్లికేట్ నెంబర్ ప్లేట్ వాడే వారిపై ఎఫ్ఐఆర్ ఫైల్ చేసి, 420 కేసు నమోదు చేయటంలో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, రాత్రి పది గంటలు దాటిన తరువాత తరువాత అత్యవసర సేవలు అందించే షాప్‌లు మినహాయించి, మిగిలిన అన్ని రకాల వైన్‌షాప్‌లు, టీ స్టాల్స్, ఇతర వ్యాపార వ్యవహారాలు నిర్వహించేవారు క్లోజ్ చేయాలని తెలిపారు. యువత ఎక్కువగా మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలు అలవాట్లకి దూరంగా ఉండాలని, గంజాయి ఇతర నిషేధిత మత్తు పదార్థాలు సేవించే వారు, అమ్మకాలు జరిపే వారి సమాచారం తెలిపినట్లయితే వెంటనే 100కి డయల్ చేయాలని లేదా స్థానిక పోలీస్ వారికి సమాచారం అందించి, పోలీస్ వారికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రఘు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లోకోస్ యాప్‌లో సభ్యుల వివరాలు నమోదు చేయాలి

**- జిల్లా డిపిఎం డి. శ్రీనివాస్**

*కల్లూరు, జనవరి 20, ప్రభాతవార్త*

తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కల్లూరు ఉషోదయ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్త్రీ శక్తి భవన్ నందు నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా డిపిఎం డి. శ్రీనివాస్ మాట్లాడుతూ సెర్ప్ ద్వారా స్వయం సహాయక సంఘాలను జాతీయ జీవనోపాధుల కల్పన పథకానికి అనుసంధానం చేయడానికి లోకోస్ యాప్ నందు ప్రతి సంఘం నందు మొత్తం బ్యాంక్ అకౌంట్ సభ్యుల ఆధార్ కార్డు, బ్యాంక్ సంఘం వివరాలు నమోదు చేయాలని, ఈ నమోదు ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన వారం రోజుల్లో ప్రతి సంఘం, ప్రతి సభ్యురాలు తమ వివరాలను నమోదు చేసుకుని, జాతీయ జీవనోపాధుల పథకానికి అనుసంధానం అర్హత పొందేందుకు, అందరికీ అర్హత కొరకు ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. ఏపిఎం వెంకట రామారావు మాట్లాడుతూ ప్రతి నెలా సమావేశాలు నిర్వహించుకుని సంఘాలు బ్యాంక్ లింకేజి, రీ పేమెంట్ వంద శాతం ప్రగతి



సాధించాలని, సామాజిక పెట్టుబడి నిధి రీ పేమెంట్ గురించి, ప్రతి స్వయం సహాయక సంఘం, గ్రామ సంఘం జెండర్ కార్యక్రమాలు, రూరల్ అవుట్‌లెట్లు, లోకోస్ యాప్ గ్రామపంచాయితీ అభివృద్ధి ప్లాన్స్, వివిఆర్‌పి వివోలో అన్ని సంఘాలు పనితీరు మెరుగుపరుచుకుని సంస్థాగత నిర్మాణం గురించి గ్రూపులు ఏబిసి గ్రేడ్ కలిగి ఉండాలని, ప్రతి సంఘంలో పొదుపులు, అప్పులు సక్రమంగా చెల్లిస్తూ శ్రీనిధి ఋణాలు సక్రమంగా చెల్లించాలని తెలిపారు. ఈ సమావేశంలో మండల సమాఖ్య ప్రతినిధులు, డిఎం.జి. ప్రశాంత్‌రెడ్డి లోకోస్ యాప్ గురించి వివరించారు. ఈ సమావేశంలో సీసీలు పి. వెంకటేశ్వర్లు, సిహెచ్. శ్యామలాదేవి, టి. రాజ్యలక్ష్మి, వెంకట్రావమ్మ, ఎస్తేరు ఆనందకుమారి, అకౌంటెంట్ అపర్ణ లక్ష్మి, గ్రామ సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు చేయాలని రైతన్నల రాస్తారోకో

**- తరుగు పేరుతో దగా చేస్తున్న మిల్లు యజమాని..**
**- రెండు, మూడు రోజుల్లో సిసిఐ కేంద్రాన్ని మూసివేస్తాం..**

*తల్లాడ, జనవరి 20, ప్రభాతవార్త*





రైతు పండించిన పత్తికి గిట్టుబాటు ధర కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం సిసిఐ కేంద్రాన్ని తల్లాడలో ఏర్పాటు చేయగా బయ్యర్ నిర్లక్ష్యంకు తోడు మిల్లు యజమానుల అహంకారం తోడవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. శుక్రవారం సాయంత్రం నుండి రైతులు సిసిఐ కేంద్రానికి పత్తిని తీసుకురాగా సిసిఐ బయ్యర్లు, మిల్లు యజమానులు కొనుగోలు చేయకపోవడంతో రాత్రి వెనుదిరిగి శనివారం ఉదయం కూడా తిరిగి అదే పరిస్థితి నెలకొనడంతో రైతన్నలు ఆందోళనకు దిగారు. వీరికి మండల రైతు సంఘం కార్యదర్శి ఐనాల రామలింగేశ్వరరావు, గోపాలపేట సర్పంచ్ నల్లమోతు మోహన్‌రావు రైతులకు మద్దతు తెలపగా, ఆందోళన చేపట్టారు. గత పది, పదిహేను రోజుల నుండి రైతులు నేరుగా సిసిఐ కేంద్రానికి పత్తి తీసుకుని వస్తే నాణ్యత లేదని తిరస్కరించడం గత్యంతరం లేని పరిస్థితిలో రైతులు దళారుల వద్దకు వెళ్ళి విక్రయాలు జరపగా, వాటిని దళారులు సిసిఐ కేంద్రానికి తీసుకుని వస్తే నేరుగా కొనుగోలు చేయడంతో రైతులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే మిల్లు యాజమానులు, బయ్యర్లు తనకు నచ్చిన వారికి రెండు కిలోలు, నచ్చని వారికి ఐదు నుండి పది కేజీల వరకు తరుగు తీసి రైతుల శ్రమను దోచుకుంటున్నారని వాపోయారు. సిసిఐ నిర్వహణ ఇలాగే ఉంటే ఆందోళన ఉధృతం చేస్తామని సిపిఎం నాయకులు ఐనాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు హెచ్చరించగా, మార్కెట్ కమిటీ కార్యదర్శి ప్రసాద్ ఆందోళన చేస్తున్న వారి వద్దకు వచ్చి కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

**రెండు మూడు రోజుల్లో సిసిఐ కొనుగోళ్ళు మూసివేస్తాం.....**

రెండు, మూడు రోజుల్లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని మూసివేస్తామని సిసిఐ బయ్యర్ కొట్టి శ్రీనివాస్ వెల్లడించారు. శనివారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ నాలుగు రోజుల నుండి నాణ్యమైన ప్రతి రావడం లేదని దీంతో పత్తి కొనుగోలు నిలిపివేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో తామే స్వయంగా కలెక్టర్‌కు విన్నవించి, సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని మూసివేయాల్సిందిగా కోరుతామని తెలిపారు. మిల్లర్లు నాణ్యత లేని పత్తిని ఎందుకు కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించగా వారి లాభం కోసం నాణ్యత లేని పత్తిని కూడా కొనుగోలు చేయాలని ముందుకు రావడంతో సమస్య ఏర్పడిందని, నిజమైన రైతులు దళారులకే పత్తి అమ్ముతున్నారని, దీంతో దళారులు కూడా నాణ్యత లేని పత్తిని కలిపి, సిసిఐ కేంద్రానికి తీసుకువస్తున్నారని ఒక ప్రశ్నకు సమాధానంగా జవాబిచ్చారు. ఏది ఏమైనా బయ్యర్, మిల్లు యజమానుల నిర్లక్ష్యానికి రైతులు ఇబ్బందులు పడుతుండగా విచారణ జరపాలని సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు నిర్ణయించుకున్నారు.




# మిరప సాగు రైతులను ఆదుకోవాలి




*పెనుబల్లి, జనవరి 20, ప్రభాతవార్త*

మిరప పంట సాగు చేసిన రైతులు పంటకు పట్టిన చీడ పీడలతో మిరప సాగు తీవ్ర నష్టాల పాలైందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. పెనుబల్లి మండల జనరల్ సమావేశం సీనియర్ నాయకులు తాండ్ర రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చలమాల మాట్లాడుతూ మిరప పంట సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పెనుబల్లి మండలంతో పాటు ఇతర మండలాల్లో కూడా ఏడాది మిరప సాగు గణనీయంగా పెరిగిందని, కౌలుకు తీసుకుని మిరప సాగు చేసిన రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైందన్నారు. ఎకరాకు రూ. 50 వేల నుండి రూ. 70 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతుకు కనీసం కూలీ ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా వైరస్ సోకి పంట పసుపు రంగుకు మారి, ఎన్ని పురుగు మందులు వాడినా ఉపయోగం లేకుండా పోయిందని అన్నారు. ఉపాధి హామీ పథకం పనుల ద్వారా వ్యవసాయ కూలీలకు, 200 రోజులు పని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, చలమాల నరసింహారావు, సండే సత్యం, గుడిమెట్ల బాబు, నాగమణి, తడికమళ్ళ చిరంజీవి పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల అల్పాహారం



*కల్లూరు, జనవరి 20, ప్రభాతవార్త*

కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు 35 రోజుల పాటు అల్పాహారాన్ని శనివారం ప్రారంభించారు. 1979-81 విద్యా సంవత్సరానికి చెందిన 40 మంది పూర్వ విద్యార్థులు అల్పాహారాన్ని 35 రోజుల పాటు 180 మంది పేద విద్యార్థులకు 1.5 లక్షల రూపాయలు విలువచేసే అల్పాహారాన్ని అందించేందుకు వితరణ చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.

# ఆలయ పురోహితులకు ఘన సన్మానం

*తల్లాడ, జనవరి 20, ప్రభాతవార్త*



గత ఆరు సంవత్సరాలుగా మండల పరిధిలోని కేశవాపురం గ్రామంలో గల శ్రీ సీతారామఆంజనేయస్వామి ఆలయంలో అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలయ సేవలం దించి, గ్రామ ప్రజల మన్ననలు అందుకుని, పౌరహిత్యం నిర్వహించి, తమ స్వగ్రామం వెళుతున్న శ్రీనివాసన్ కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ అలెఖ్య అశోక్, ఆలయ కమిటి సభ్యులు, గ్రామ పెద్దలు ఆలయంలో నూతన వస్త్రాలు సమర్పించి శనివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి కోశాధికారి సాధం రమేష్, కమిటి సభ్యులు చిన్నంశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఆలయ కమిటి అధ్యక్షులు ఖమ్మంపాటి వెంకటేశ్వరరావు, హరి వెంకటేశ్వరరావు, కట్టా శ్రీనివాసరావు, వనిగండ్ల కోటేశ్వరరావు, గ్రామ పెద్దలు చావా నరసింహారావు దంపతులు, వనిగండ్ల పిచ్చయ్య, ఏలూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వైద్యంతో ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించాలి

**-వంటశాల వైద్యశాల కావాలి - అమ్మే డాక్టర్ కావాలి-నేటి జాతీయ ఆరోగ్య సమేళనను విజయవంతం చేయండి**

**-సిద్ధార్ధ యోగా విద్యాలయం చైర్మన్ డాక్టర్ రామచంద్ర**



*నేలకొండపల్లి, జనవరి 20 ప్రభాతవార్త:*
సహజ సిద్దమైన ప్రకృతి వైద్యంతో ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం జరగాలని, ప్రకృతి వైద్యంను దేశవ్యాప్త ఉద్యమంగా చేపట్టాలని డాక్టర్ రామచంద్ర ఛారిటబుల్ ట్రస్టు, సిద్ధార్ధ యోగా విద్యాలయం చైర్మన్, ప్రకృతి వైద్యులు డాక్టర్ రామచంద్ర వెల్లడించారు. ప్రతి ఇంట్లోని వంటశాల వైద్యశాల కావాలని, అమ్మే డాక్టర్ కావాలని ఆయన చెప్పారు. శనివారం నేలకొండపల్లి గ్రామ సమీపం లోని బౌద్దస్తూపం



దగ్గరలో గల సిద్ధార్ధ యోగ విద్యాలయం నందు స్ధానిక విలేకరులతో డాక్టర్ రామచంద్ర మాట్లాడారు. సిద్దార్ధ యోగ విద్యాలయం 24 ఏళ్ళు పూర్తి చేసుకుని రజతోత్సవ సంవత్సరం లోకి అడుగు పెడుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీన సిద్ధార్ధ యోగ విద్యాలయం ఆవరణ నందు భారత జాతీయ ప్రకృతి ఆరోగ్య సమ్మేళనను నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే ఈ సమ్మేళనం సాయంత్రం వరకు కొనసాగుతుందని ఆయన చెప్పారు. ఈ సమ్మేళనంలో దేశంలోని 9రాష్ట్రాలకు చెందిన దాదాపు 3వేల మంది ప్రతినిధులు హజరౌతారని ఆయన చెప్పారు. వివిద ధీర్ఘకాలిక వ్యాధుల సమస్యల పరిష్కారం, ప్రకృతి పరంగా వాటి పరిష్కారం ఎలా, ఎక్కడ, ఏరాష్ట్రంలో, ఏప్రాంతంలో ఇటువంటి సహజ సిద్దమైన ప్రకృతి వైద్య కేంద్రాలను ఏర్పాటు ఎలా చేయాలి, భవిష్యత్‌లో దీన్ని మరింత విస్తృతంగా ప్రజలలోకి ఏవిధంగా తీసుకు వెళ్ళాలనే ఉద్దేశ్యంతో ప్రముఖుల సూచనలు, సలహాలు, నిర్ణయాలు తీసుకునేందుకు ఈ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఇక్కడ జరిగే సమ్మేళనంలో అనేక నాచురల్ యాక్టివిటీస్ ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ సమ్మేళనంకు అనేక మంది వైద్య శాస్త్ర నిపుణులు, సామాజిక అభివృద్ధి పట్ల ప్రేమ ఉన్న ప్రముఖులు హజరవ్వడమే కాక వారి ప్రసంగాలు ఉంటాయని ఆయన చెప్పారు. షుగర్, బిపి వ్యాధులను తగ్గించుకున్న రోగులే కాక లివర్ ప్లాంటేషన్, కిడ్నీ సమస్యలకు గురై ఇక్కడి సిద్ధార్ధ యోగా విద్యాలయం నందు చికిత్సలు పొంది సంపూర్ణ ఆరోగ్యంతులే విజయం సాధించిన వారి అనుభవాలను ఈ సమ్మేళనంలో చెప్పనున్నారని ఆయన అన్నారు. ఈ సమ్మేళనంకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్నాటక, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలకు చెందిన రోగాలను తగ్గించుకుని ఆరోగ్యవంతమైన వారు పాల్గొంటారని ఆయన చెప్పారు. ప్రజలు అందిరికి ఉపయోగపడే విధంగా ఈసమ్మేళనం జరుపనున్నట్లు ఆయన చెప్పారు. ఈ సమ్మేళనంను పురస్కరించుకుని ఇక్కడ వంద రకాల దేశవాళీ బియ్యం ప్రదర్శన, వంద రకాల దేశవాళీ కూరగాయల విత్తనాల ప్రదర్శన, మగ్గం నేత, మట్టి కుండల తయారీ ప్రదర్శన, భారత పురాతన మల్కం గేమ్ ప్రదర్శన, బాల,బాలికల సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. అంతేకాక, ఈ సమ్మేళనంకు హజరయ్యే అతిధుల కోసం సహజ సిద్దమైన భోజనంను ఆహరంగా ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ ప్రకృతి ఆరోగ్య సమ్మేళనంకు ప్రకృతి ప్రేమికులు, ఆరోగ్యాభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వివిద రంగాలకు చెందిన ప్రముఖులు రాజారెడ్డి, శ్యామ్‌సుందర్, ప్రసాదు, మధుసూదన్‌రావు, వరప్రసాదు, అప్పారావు, పలువురు వాలంటీర్‌లు తదితరులు పాల్గొన్నారు.




## చెన్నారం పశువైద్య శిబిరం విజయవంతం



*నేలకొండపల్లి, జనవరి 20 ప్రభాతవార్త:*
జిల్లా పశుగణాభివృద్ది సంస్ధ, పశుసంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం చెన్నారం గ్రామం నందు నిర్వహించిన గోపాలమిత్ర పశువైద్య శిభిరం విజయవంతమైంది. ఈ పశువైద్య శిభిరంను నేలకొండపల్లి పశువైద్య సహయ సంచాలకులు డాక్టర్ బి.శ్రీనివాసరావు ప్రారంభించి ప్రసంగించారు. ఈ శిభిరంలో 37 పశువులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించారు. అలాగే, 45 లేగదూడలకు నట్టలమందు త్రాగించారు. 25 పశువులకు సాధారణ వైద్య పరీక్షలు చేసారు. ఈ శిభిరంలో పశువులకు వైద్య పరమైన చికిత్సా సేవలను రాజేశ్వరపురం పశువైద్యాధికారి డాక్టర్ టి.సంజయరెడ్డి అందచేసారు. పశువుల యాజమాన్య పద్దతుల గురించి ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ మండల పశువైద్యాధికారి డాక్టర్ అశోక్, కోరుట్ల వెటర్నరీ యూనివర్శిటీ నుండి శిక్షణ పొందుతున్న డాక్టర్ శ్వేత, డాక్టర్ మధురికలు పశవైద్య చికిత్సలకు సహకరించారు. ఈ కార్యక్రమం లో చెన్నారం పిఏసిఎస్ అధ్యక్షుడు వందనపు నాగేశ్వరరావు, రైతులు చింతనిప్పు సైదులు, పుసులూరి భాస్కరరావు, బందారుపల్లి వెంకటేశ్వర్లు, గంజికుంట్ల వెంకన్న, గోపాలమిత్ర సూపర్‌వైజర్ జే.శంకరయ్య, గోపాలమిత్రలు నాగరాజు, తాజ్‌పాషా, పాండురంగయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జేసి



*దమ్మపేట ఏజెన్సీ, జనవరి 20, ప్రభాతవార్త:*
మండలంలోని మల్కారం, లచ్చాపురం గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ పి. రాంబాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఓటు నమోదు ఎలా చేసుకోవాలని మరియు సవరణ చేసుకునే విధానాన్ని గ్రామస్థులకు తెలియజేశారు. గ్రామ పరిధిలోగల పట్టు భద్రులకు ఫారం 18 ద్వారా ఎమ్మెల్సీ ఎలక్షన్ కొరకు ఓటు నమోదు చేసుకొని అట్టి దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని ఆయన తెలిపారు. ఓటు నమోదుకు చివరి ఫిబ్రవరి 6వ తేదీ అని అన్నారు. దరఖాస్తు చేసుకునే డిగ్రీ మెమో కలిగి ఉండాలని, 1.11.2020 నాటికి ఉత్తీర్ణులై ఉండాలని అటువంటి వారు ఓటు హక్కు పొందడానికి అర్హులని తెలిపారు.

## గోపాలపేటలో ఎస్ఎంసి సమావేశం

*తల్లాడ, జనవరి 20, ప్రభాతవార్త*



మండల పరిధిలోని గోపాలపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్ఎంసి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ ఓటర్ల జాబితాను బిఎల్వో లు, ఉపాధ్యాయుల సమక్షంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలపేట సర్పంచ్ నల్లమోతు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే జారె



*దమ్మపేట ఏజెన్సీ, జనవరి 20, ప్రభాతవార్త:*
2024 పీఆర్‌టియు క్యాలెండర్‌ను అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గండుగులపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు తమ సమస్యలను జారెకు వివరించారు. ఆయన స్పందిస్తూ ఉపాధ్యాయుల సమస్యలన్నీ తీర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దంగా ఉందని, నియోజవకర్గంలోని పాఠశాలల సమస్యల పరిష్కారానికై ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు తెలంగాణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అద్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోళ్ల సుధాకర్‌రెడ్డి, మహ్మద్ జావిద్, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఘనంగా జోగి బాబు జన్మదిన వేడుకలు



*దమ్మపేట ఏజెన్సీ, జనవరి 20, ప్రభాతవార్త:*
సహకార పరపతి సంఘం అధ్యక్షులు రావు జోగేశ్వరరావు జన్మదిన వేడుకలను దమ్మపేట లోని ఆయన నివాసంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ధార మల్లిఖార్జునరావు, ముష్టిబండ సర్పంచ్ తిరుపతిరావు, రవీంధ్ర, విశ్వేశ్వరరావు, బిఆర్ఎస్ టౌన్ అధ్యక్షులు యార్లగడ్డ బాబు, పానగంటి చిట్టిబాబు, రామకృష్ణ, ప్రసాద్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య రాముని అక్షింతలకు టేకులతండాలో ఊరేగింపు



*కామేపల్లి, జనవరి 20 ప్రభాతవార్త:*
అయోధ్య శ్రీరాముని అక్షింతలను కామేపల్లి మండలం టేకులతండాలో శుక్రవారం సాంప్రదాయ బద్దంగా భక్తి శ్రద్దలతో స్ధానిక దేవాలయంకు తీసుక రావడం జరిగింది.ఊరేగింపుగా అక్షింతలను తీసుకరావడం జరిగింది.అనంతరం ఇంటింటా అక్షింతలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో భక్తులు,గ్రామస్తులు,ప్రజాప్రతినిధులు,ఉపాధ్యాయుడు సపావట్ కిషన్ తదితరులు ఈ ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

*కామేపల్లి, జనవరి 20 ప్రభాతవార్త:*



వ్యవసాయ కార్మిక సంఘం క్యాలెండర్‌ను కామేపల్లి తహాశీల్దార్ సిహెచ్ సుధాకర్ చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి దుగ్గి కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాదావత్ శ్రీను, ఏర్పుల శాంతయ్య, డిప్యూటీ తహాశీల్దార్ శంకర్, ఆర్ఐ సక్రునాయక్,సర్వేయర్ పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ విపి గౌతమ్**

**ఖమ్మం, జనవరి 20, ప్రభాతవార్త :** ఫోటో ఎలక్ట్రోరల్ రోల్ స్పెషల్ సమ్మరి రివిజన్‌లో భాగంగా శని, ఆదివారాల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ శనివారం పేర్కొన్నారు. కలెక్టర్ నగరంలోని రోటరీనగర్‌జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలు ప్రతి పోలింగ్ కేంద్రాల్లో చేపడతామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బూత్ లెవల్ అధికారులు ఉదయం 10గంటల నుండి డ్రాఫ్ట్ ఫోటో ఓటర్ లిస్ట్, ఫారం-6,7,8లతో అలందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. అట్టి కేంద్రానికి వెళ్ళి తమ ఓటు నమోదై ఉందో..? లేదో..? చూసుకొని, ఒకవేళ లేకుంటే వెంటనే నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, ఖమ్మం అర్బన్ తహాశీల్దార్ స్వామి, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.








# భరోసా కేంద్రానికి కాంట్రాక్టు పద్దతిలో ఉద్యోగాల కోసం దరఖాస్తుల స్వీకరణ

**- జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు**

**కొత్తగూడెం క్రైం, జనవరి 20 - ప్రభాతవార్త:** జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మహిళా భరోసా కేంద్రానికి కాంట్రాక్టు ప్రాతిపదికన మహిళా అభ్యర్థుల నియామకాల కోసం దరఖాస్తుల స్వీకరణ చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. భరోసా సెంటర్ భద్రాద్రి కొత్తగూడెంలో పనిచేసేందుకు రెసెప్షనిస్టు (1), సపోర్టు పర్సన్ (2), లీగల్ సపోర్టు పర్సన్ (1), మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ ఏఎన్ఎం(01) పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని అన్నారు. సర్వీస్ రెగ్యులరైజేషన్ హక్కులు లేకుండా కాంట్రాక్టు ప్రాతిపదికన భరోసా సెంటర్ కోసం మహిళా ఉద్యోగులను భర్తీ చేయడం జరుగుతుందని అన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు 21.1.2024 నుంచి 1.2.24 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ ఉద్యోగ నియామకాలు ఒక ఏడాది కాల వ్యవధి కోసం మాత్రమేనని, అనంతరం అదే కాల వ్యవధి ఆవశ్యకత, బడ్జెట్ ప్రకారం ప్రతీ సంవత్సరం పొడిగించబడుతుందని అన్నారు. బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు, అనుభవం సర్టిఫికెట్, తగిన పత్రాలన్నింటినీ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని ఇన్‌వార్డు సెక్షన్‌లో అందించాలని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ఆఖరి తేదీ 1.2.2024 సాయంత్రం 5 గంటల వరకు సమయం ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ ప్రక్రియ ఏఆర్ అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) విజయ్‌బాబు ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ఏదైనా సమాచారం కోసం షీటీమ్ ఎస్సై రమాదేవి 8712682131 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించాలని తెలిపారు.




# కన్నులపండువగా రామయ్య కళ్యాణం

**భద్రాచలంకల్చరల్ ప్రభాతవార్త :** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో భద్రాద్రి రామయ్య కళ్యాణం కన్నుల పండువగా సాగింది. ఉదయమే పవిత్ర గోదావరి నది నుండి జలాలను మేలతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ప్రధాన ఆలయానికి తీసుకుని వచ్చి స్వామి వారి మూలవరులకు అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారి కళ్యాణ మూర్తులను బేడా మండపానికి భక్తుల జయజయ ధ్వానాల నడుమ తీసుకుని వచ్చారు. ముందుగా భద్రాద్రి దివ్యక్షేత్ర మహత్యాన్ని భక్తులకు అర్చక స్వాములు తెలిపిన అనంతరం కళ్యాణ తంతు ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన జరిపి కళ్యాణ తంతును కన్నుల పండువగా నిర్వహించారు. అనేక మంది దంపతులు ఈ కళ్యాణంలో పాల్గొని తరించారు. కళ్యాణం అనంతరం భక్తులకు స్వామి వారి నూతన వస్త్రాలు, అక్షతలు, ప్రసాదం వితరణగావించారు.

# భద్రాద్రి రామయ్యకు బంగారు ఆభరణం బహూకరణ

**భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం హైద్రాబాద్ పట్టణానికి చెందిన అక్కెల్ల శ్రీనివాస్‌ప్రతాప్ కుటుంబసభ్యులు బంగారు హారంను బహూకరించారు. శనివారం శ్రీస్వామి వారి దర్శనార్థమై కుటుంబసమేతంగా విచ్చేసిన ఈయన ముందుగా హారంను దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎల్.రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థాన అధికారులు శ్రీస్వామి వారి అంతరాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహింపజేశారు. అనంతరం దేవస్థానం ఆవరణలోని శ్రీలక్ష్మీతాయారమ్మ వారి సన్నిధిలో వేదపండితులు వేదాశీర్వచనం అందజేయగా, అధికారులు శాలువాతో సత్కరించి శ్రీస్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. కార్యనిర్వహణాధికారి వెంట దేవస్థాన సూపరింటెండెంట్ లింగాల సాయిబాబా ఉన్నారు. సమర్పించిన హారం 35 గ్రాములు కలిగి ఉందని, దీని విలువ రూ.2,39,429లుగా దేవస్థాన అధికారులు వెల్లడించారు.



# పారిశుధ్య కార్యక్రమాలు ప్రతీరోజు జరగాలి



**- పాల్వంచలో పర్యటించిన కలెక్టర్ ప్రియాంక ఆల**

**పాల్వంచ అర్బన్, జనవరి 20 - ప్రభాతవార్త:** పారిశుధ్య కార్యక్రమాలు ప్రతీరోజు జరగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం పాత పాల్వంచలోని జెడ్పీ హైస్కూల్, మండల ప్రాథమిక పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. 21వ తేదీ ఆదివారం కూడా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు ప్రత్యేక కేంద్రాలు జరుగుతాయని, ఓటర్లు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటుహక్కు కోసం నమోదు కావాలని అన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్‌స్థాయిఅధికారులు అందుబాటులో ఉంటారని, ఓటరు నమోదుకు, మార్పులు, చేర్పులకు అలాగే తొలగింపులకు అవసరమైన 6,7,8 ఫారాలను అందజేయాలని సూచించారు. శనివారం 1095 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఫారం 6కు 519, ఫారం7కు 155, ఫారం8కు 223 మొత్తం 897 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె చెప్పారు. వచ్చిన ప్రతీ దరఖాస్తును జాగ్రత్తగా భద్రపర్చాలని అన్నారు. అనంతరం పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్పనగర్, శ్రీనివాస కాలనీలలో పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీవో శిరీష, మున్సిపల్ కమిషనర్ స్వామి, తహసీల్దార్ నాగరాజు పాల్గొన్నారు.



# జిల్లా ఎస్పీని కలిసిన పీఏసీఎస్ వైస్ చైర్మన్

**లక్ష్మీదేవిపల్లి, జనవరి 20 - ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా ఎస్పీ బిరుదురాజు రోహిత్‌రాజును పీఏసీఎస్ వైస్ చైర్మన్ కూచిపూడి జగన్ ఆధ్వర్యంలో శనివారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో హేమచంద్రాపురం సర్పంచ్ బండ వెంకటేశ్వర్లు, గోలి శ్రీను, కల్లుగడ్డ సురేష్, నాగేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# 22న హెడ్డాఫీస్ ఎదుట ధర్నా

**కొత్తగూడెం, జనవరి 20 - ప్రభాతవార్త:**



సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థకు సేవలందించిన మాజీ కార్మికుల పట్ల యాజమాన్యం, ప్రభుత్వాలు, నిర్లక్ష్యం వహిస్తున్నాయని, మాజీ కార్మికులకు సౌకర్యాలు కల్పించడంలో వివక్షత ప్రదర్శిస్తున్నారని సింగరేణి రిటైర్డ్ కార్మికుల సంఘం రీజినల్ అధ్యక్షుడు మాతంగి లింగయ్య, కార్యదర్శి లక్ష్మీనారాయణలు ఆరోపించారు. ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ అధికారులకు కల్పిస్తున్న సౌకర్యాలు మాజీ కార్మికులకు కలిపించడం లేదని, ప్రభుత్వ ఉద్యోగులకు, సింగరేణి ఉద్యోగులు, కార్మికులకు పెన్షన్‌లో తీవ్ర వ్యత్యాసం ఉందని, ఇపనటికీ రూ.200 లోపు పెన్షన్ తీసుకునే మాజీ కార్మికులు ఉన్నారని అన్నారు. ప్రతీ మూడేళ్లకోకసారి పెన్షన్ విధానంపై సమీక్షించి ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22వ తేదీన హెడ్డాఫీస్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో దమ్మాలపాటి శేషయ్య, వంగ వెంకటెల్, జే.గట్టయ్యలు పాల్గొన్నారు.